## విలేకరులు కావలెను

"ప్రజా శంఖారావం" తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

"ప్రజా శంఖారావం" తెలుగు దినపత్రిక.

సంప్రదించాల్సిన చిరునామా..

నిజామాబాద్ సెల్ : 9440731515



epaper.prajashankaravam.com

తెలుగు డైలీ ఈ-పేపర్

RNI NO: TELTEL/2022/85170

# ప్రజా శంఖారావం

తెలుగు దిన పత్రిక

ప్రతి అక్షరం.. ప్రజా స్వరం..

PRAJA SHANKARAVAM TELUGU DAILY

పేజీలు 8

శుక్రవారం 05.06.2026 | సంపుటి: 04 | సంచిక: 25 | వెల: రూ. 3/- | ఎడిటర్: పుట్టి మురళి

హైదరాబాద్ | ఆదిలాబాద్ | నిర్మల్ | నిజామాబాద్ | కామారెడ్డి | జగిత్యాల | మంచిర్యాల | సిద్దిపేట్ | రాజన్న సిరిసిల్ల | సంగారెడ్డి | మెదక్


# పల్లెల్లో ఇందిరమ్మ లొల్లి



- గ్రామాల్లో సెగ రేపుతున్న లబ్ధిదారుల ఎంపిక
- కాంగ్రెస్ నేతల్లోనే అంతర్గత కుమ్ములాటలు
- డిమాండ్‌కు సరిపోని ఇళ్ల కోటా
- అధికార పార్టీలో అసంతృప్తి స్వరాలు
- ప్రతిపక్షాలకు దొరికిన కొత్త అస్త్రం

**హైదరాబాద్, జూన్ 4:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ చర్చకు దారితీస్తోంది. నిరుపేదలకు సొంత ఇంటి కలను నెరవేర్చే లక్ష్యంతో అమలవుతున్న ఈ పథకానికి ప్రజల నుంచి భారీ స్పందన లభిస్తున్నప్పటికీ, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పలు గ్రామాల్లో వివాదాలకు కేంద్రబిందువుగా మారింది. దీంతో అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు స్థానిక అధికార యంత్రాంగం కూడా ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ప్రస్తుతం పథకం రెండో విడత అమలు కొనసాగుతోంది. మొదటి విడతలో నియోజకవర్గాల వారీగా వేల సంఖ్యలో ఇళ్లు మంజూరు చేసినప్పటికీ, గ్రామాల వారీగా చూస్తే

మిగతా 2వ పేజీలో..





3

## సీఎం రేవంత్ మెగా టూర్

పాలమూరు ప్రాజెక్టులపై స్పెషల్ ఫోకస్

- నారాయణపేట, గద్వాల సాగునీటి ప్రాజెక్టుల తనిఖీ..
- స్పాట్ లోనే కీలక ఆదేశాలు
- బెంగళూరు నుంచి నేరుగా మక్తల్ కు చేరుకున్న ముఖ్యమంత్రి
- నెట్టెంపాడు, గూడెందొడ్డి రిజర్వాయర్ ను పరిశీలించిన సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్

## చార్మినార్ వద్ద కేటీఆర్ సందడి

- నిమ్రా కేఫ్‌లో ఇరానీ చాయ్, ఉస్మానియా బిస్కెట్ల రుచి
- పాతబస్తీ పర్యటనకు సంపూర్ణత్వం ఇరానీ చాయ్‌తోనే
- ఎక్స్ వేదికగా కేటీఆర్ వ్యాఖ్యలు



2



## పోలవరంతో భద్రాచలానికి ముంపు ప్రమాదం

- గ్రామాలు, పరిశ్రమలకు జలగండమే
- ముంపు బాధితులకు తక్షణం నష్టపరిహారం చెల్లించాలి
- శాశ్వత పునరావాసం కల్పించాలి
- పీపీఏ సీఈఓకు మాజీమంత్రి హరీష్‌రావు లేఖ

2



## కీలక ఖనిజాల అబ్జర్వేటరీ శాటిలైట్ కేంద్రం ప్రారంభం

భారత్‌యూకే భాగస్వామ్యంలో మరో కీలక మైలురాయి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**న్యూఢిల్లీ, జూన్ 4 :** భారత్‌యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) మధ్య క్రిటికల్ మినరల్స్ రంగంలో వ్యూహాత్మక భాగస్వామ్యం మరో కీలక మైలురాయి చేరుకుంది. 2025లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ ద్వైపాక్షిక భేటీ సందర్భంగా

మిగతా 2వ పేజీలో..

## హైదరాబాద్‌లో ఎబోలా కలకలం

- సూడాన్ నుంచి వచ్చిన ప్రయాణికుడిలో లక్షణాల గుర్తింపు
- గాంధీ ఆస్పత్రిలో ప్రత్యేక వార్డుకు తరలింపు
- నిర్ధారణ కోసం సీసీఎంబీకి శాంపిల్స్ పంపిన వైద్యులు




**హైదరాబాద్, జూన్ 4:** శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎబోలా వైరస్ అనుమానిత కేసు కలకలం రేపింది. సూడాన్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఓ విదేశీ ప్రయాణికుడిలో ఎబోలా లక్షణాలు ఉన్నట్లు గుర్తించిన అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. విమానాశ్రయంలో నిర్వహించిన ఆరోగ్య పరీక్షల్లో ముహమ్మద్ అనే ప్రయాణికుడికి ఎబోలా వైరస్‌కు సంబంధించిన లక్షణాలు ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. దీంతో అతడిని వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డులో

మిగతా 2వ పేజీలో..

## గంజాయి రవాణాపై ఈగిల్ కొరడా

- అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠా గుట్టురట్టు
- 12.739 కిలోల ప్రీమియం హైడ్రోపోనిక్ గంజాయి స్వాధీనం
- థాయ్‌లాండ్–హైదరాబాద్–ముంబై కేంద్రాలుగా నెట్‌వర్క్
- 40 మంది నిందితుల గుర్తింపు

**హైదరాబాద్, జూన్ 4:** మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై రాష్ట్ర ఈగిల్ ఫోర్స్ ఉక్కుపాదం మోపింది. థాయ్‌లాండ్ నుంచి భారత్‌కు హైడ్రోపోనిక్ గంజాయిని

మిగతా 2వ పేజీలో..



## అమీర్‌పేట్‌లో భారీ అగ్నిప్రమాదం

- సమీప దుకాణాలకు వ్యాపించిన అగ్నికీలలు
- రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది
- ప్రమాద కారణాలపై దర్యాప్తు

**హైదరాబాద్, జూన్ 4:** హైదరాబాద్‌లోని అమీర్‌పేట్ ప్రాంతంలో గురువారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మైత్రివనం ఎదురుగా ఉన్న

మిగతా 2వ పేజీలో..



## రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచం: పొంగులేటి

- భూముల విలువలపై సందేహాలకు టోల్‌ఫ్రీ, వాట్సాప్ నంబర్లు
- రెవెన్యూ వ్యవస్థలో సంస్కరణలు తీసుకొచ్చాం
- ఫ్యూచర్ సిటీ రద్దు చేసే ప్రసక్తే లేదు

2

## లాసెట్‌లో మాజీ మావోయిస్టు నేత ప్రతిభ

50 ఏళ్లు దాటినా చదువుపై పట్టుదల




- రాష్ట్ర స్థాయిలో 349వ ర్యాంకు సాధించిన దేవ్‌జీ
- లాయర్‌గా మారి పేదలకు సేవ చేయడమే లక్ష్యం
- న్యాయ విద్య వైపు మాజీ మావోయిస్టు అగ్రనేత అడుగులు

2

## మెట్రో వ్యవస్థకు ఎలాంటి నష్టం లేదు..

- అమీర్‌పేట్ అగ్నిప్రమాదంపై స్పందించిన హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీ
- మెట్రో స్తంభాలకు ఎలాంటి నష్టం జరగలేదన్న అధికారులు
- కాలిపోయింది వినైల్ షీట్లే.. పుకార్లను ఖండించిన మెట్రో యాజమాన్యం
- పొగతో ప్రయాణికులకు ఇబ్బంది.. యథావిధిగా కొనసాగిన మెట్రో సర్వీసులు

**హైదరాబాద్,జూన్ 4** హైదరాబాద్‌లోని అమీర్‌పేట్ మైత్రివనం సమీపంలో జరిగిన భారీ అగ్నిప్రమాదంపై హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (HMRL) ఉన్నతాధికారులు కీలక ప్రకటన చేశారు. ఈ ప్రమాదం కారణంగా పక్కనే ఉన్న మెట్రో రైలు వ్యవస్థకు ఎలాంటి నష్టం జరగలేదని హెచ్‌ఎంఆర్‌ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ సర్ఫరాజ్ అహ్మద్ స్పష్టం చేశారు.

మిగతా 2వ పేజీలో..



## అంగన్‌వాడీలకు సెలవుల పొడిగింపు

2

# గంజాయి రవాణాపై ఈగిల్ కొరడా

**మొదటిపేజీ తరవాయి**

అక్రమంగా తరలిస్తున్న అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠాను ఛేదించి భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకుంది. కస్టమ్స్ అధికారులు, పోలీసుల సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్‌లో 12.739 కిలోల ప్రీమియం హైడ్రోపోనిక్ గంజాయిని పట్టుకున్నారు. దర్యాప్తులో థాయ్‌లాండ్, హైదరాబాద్, ముంబై కేంద్రాలుగా భారీ నెట్‌వర్క్ నడుస్తున్నట్లు గుర్తించారు. మూడొందల మంది క్యారియర్లను వినియోగించి థాయ్‌లాండ్ నుంచి భారత్‌కు అధిక టిహెచ్‌సీ శాతం కలిగిన గంజాయిని తరలించినట్లు ఈగిల్ ఫోర్స్ వెల్లడించింది. గతంలో అరుదైన వస్తువుల స్మగ్లింగ్‌లో పాల్గొన్న ఈ ముఠా 2023 నుంచి మాదకద్రవ్యాల రవాణాపై దృష్టి సారించినట్లు గుర్తించారు. 2026 ఏప్రిల్ 8న రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బ్యాంకాక్ నుంచి వచ్చిన సోధా మొహసన్ బహదూర్ భాయ్ వద్ద 13.2 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రాచకొండ పోలీసులు, కస్టమ్స్ అధికారుల సంయుక్త దర్యాప్తులో హరషద్ మన్‌సుఖ్ భాయ్ ప్రజాపతి, సందీప్ వాసాని అలియాస్ రాహుల్ జైన్‌లను అరెస్టు చేసి మరో 12.739 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో గుజరాత్‌కు చెందిన దల్ అబ్దుల్లా సదుద్దీన్ నాయ్ యువకులను ప్రలోభపెట్టి గంజాయి రవాణాకు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ముంబైకి చెందిన హేమంగ్ ప్రమోద్ కెలుస్కర్, అతని సోదరుడు సుధాంశు కెలుస్కర్ ఈ రాకెట్ ప్రధాన సూత్రధారులుగా విచారణలో తేలింది. థాయ్‌లాండ్‌లో క్లబ్ వ్యాపారాన్ని అడ్డాగా చేసుకుని స్మగ్లింగ్ నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేసులో మొత్తం 40 మంది నిందితులను గుర్తించగా, పలువురిని అరెస్టు చేశారు. మరికొందరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటే 1908 నంబర్‌కు లేదా ఈగిల్ ఫోర్స్ అధికారిక మార్గాల ద్వారా తెలియజేయాలని అధికారులు ప్రజలను కోరారు.

# రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచం: పొంగులేటి

**హైదరాబాద్, జూన్ 4:**

రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రజలపై అదనపు భారం పడకూడదనే ఉద్దేశంతో రిజిస్ట్రేషన్ ఫీజులను యథాతథంగా కొనసాగిస్తున్నామని తెలిపారు.

గచ్చిబౌలిలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం మంత్రి మాట్లాడారు. భూముల విలువలను శాస్త్రీయ పద్ధతిలో వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా సవరించామని, సవరించిన విలువలపై అభ్యంతరాలు, సందేహాలు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ *1800 599 4788, వాట్సాప్ నంబర్ **8247619983*కు తెలియజేయవచ్చని సూచించారు.

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూముల కనీస విలువను ఎకరానికి రూ.2.75 లక్షలు, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.5 లక్షలు, హెచ్‌ఎండీఏ పరిధిలో రూ.10 లక్షలు, ఓఆర్ఆర్ పరిధిలో రూ.15 లక్షలుగా నిర్ణయించినట్లు తెలిపారు. రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న సుమారు 3,500 ఫైళ్లను పరిష్కరించామని, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. భూములకు సంబంధించిన అన్ని రికార్డులను డిజిటలైజేషన్ చేయనున్నట్లు వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు రద్దు చేసే అవకాశం లేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించేందుకు అత్యాధునిక సౌకర్యాలతో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నామని, మొదటి దశలో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 13 క్లస్టర్లుగా ఈ భవనాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.




# అమీర్‌పేట్‌లో భారీ అగ్నిప్రమాదం

**మొదటిపేజీ తరువాయి**

కేఎస్ఆర్ ఫ్యాషన్స్ భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి.

భవనం నుంచి ఎగిసిపడిన అగ్నికీలలు వేగంగా వ్యాపించడంతో సమీపంలోని దుకాణాలకు కూడా మంటలు అంటుకున్నాయి. మంటలు క్రమంగా విస్తరిస్తుండటంతో వ్యాపారులు, స్థానిక ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రమాద తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పోలీసులు కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

అగ్నిప్రమాదం కారణంగా ఆ ప్రాంతంలో కొంతసేపు ట్రాఫిక్ రద్దీ నెలకొంది. భద్రతా చర్యల్లో భాగంగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ఈ ప్రమాదంలో ఎవరైనా గాయపడ్డారా, ప్రాణనష్టం జరిగిందా అనే విషయాలపై ఇంకా స్పష్టత రాలేదు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చిన తర్వాత ప్రమాదానికి దారితీసిన కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టనున్నారు.




# కీలక ఖనిజాల అబ్జర్వేటరీ శాటిలైట్ కేంద్రం ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి**

క్రిటికల్ మినరల్స్ సప్లై చైన్ అబ్జర్వేటరీ ఏర్పాటు చేస్తామని చెప్పిన నేపథ్యంలో తాజాగా ఈ కేంద్రం ప్రారంభమైంది. భారత్ యూకే క్రిటికల్ మినరల్స్ గ్లోబల్ సప్లయ్ చైన్ అబ్జర్వేటరీ(జీఎస్‌సీవో) శాటిలైట్ కేంద్రాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి యూకే ఫారిన్ సెక్రటరీ ఇవెట్ కూపర్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సురక్షితమైన, స్థిరమైన, విశ్వసనీయమైన క్రిటికల్ మినరల్స్ సప్లయ్ చైన్ వ్యవస్థ నిర్మాణంలో ఈ అబ్జర్వేటరీ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. క్లీన్ ఎనర్జీ, ఆధునిక సాంకేతికతలు, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో క్రిటికల్ మినరల్స్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు వెన్నెముకగా మారుతున్నాయని, ప్రపంచంలోని అతిపెద్ద డిజిటల్ మెటీరియల్ ఫ్లో మ్యాప్ రూపకల్పనలో ఈ అబ్జర్వేటరీ ముఖ్య కేంద్రంగా నిలవనుందని వివరించారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనలో క్రిటికల్ మినరల్స్ రంగంలో స్వావలంబనకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ఈ లక్ష్యంతోనే 4 బిలియన్ డాలర్ల జాతీయ క్రిటికల్ మినరల్స్ మిషన్‌ను ప్రారంభించామని తెలిపారు. మినరల్స్ వెలికితీత, ఎక్స్‌ప్లోరేషన్, ప్రాసెసింగ్, రీసైక్లింగ్, ఇన్నొవేషన్స్ వంటి విషయాల్లో వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ఈ మిషన్ ప్రధాన ఉద్దేశమన్నారు. క్రిటికల్ మినరల్స్ రీసైక్లింగ్‌ను ప్రోత్సహించేందుకు 180 మిలియన్ డాలర్ల ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తున్నామని, దేశవ్యాప్తంగా తొమ్మిది సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. పారిశ్రామిక వ్యర్థాల నుంచి విలువైన మినరల్స్, విదేశాల్లో మినరల్స్‌ను తవ్వడం వంటి చర్యలు చేపడుతున్నామని, మినరల్స్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక విధానపరమైన సంస్కరణలు చేపడుతోందని ఆయన చెప్పారు. పారదర్శకంగా ఈఆక్షన్, ప్రైవేట్ కంపెనీలకు ప్రోత్సాహం అందించడంతోపాటు, జూనియర్ మైనింగ్ కంపెనీలకు అవకాశాలు కల్పిస్తోందన్నారు. వేగవంతంగా అనుమతులు అందిస్తూ మినరల్స్ రంగంలో పెట్టుబడులకు ప్రపంచంలోనే అత్యంత అనుకూలమైన దేశంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. బ్రిటిష్ పరిశ్రమలు, పెట్టుబడిదారులు, సాంకేతికరంగ సంస్థలు భారత క్రిటికల్ మినరల్స్ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యూకేకు ఉన్న మినరల్ ప్రాసెసింగ్, ఎక్స్‌ట్రాక్షన్ టెక్నాలజీ భారత దేశంలోని ఎలక్ట్రిక్ వాహనాలు, డిఫెన్స్, ఏరోస్పేస్, సెమీ కండక్టర్ రంగాల వేగవంతమైన అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. భవిష్యత్తులో ఈ అబ్జర్వేటరీ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన క్రిటికల్ మినరల్ ఇంటెలిజెన్స్ కేంద్రంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పరిశ్రమలు, పరిశోధకులు, పెట్టుబడిదారులకు ఈ అబ్జర్వేటరీ విలువైన సమాచారం అందిస్తుందన్నారు. కేంద్ర గనుల శాఖ, ఐఐటీ (ఐఎస్ఎం) ధన్‌బాద్, టెక్స్‌మిన్, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ఆధ్వర్యంలోని టెక్నాలజీ ట్రాన్స్‌లేషన్ రీసెర్చ్ పార్క్, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో యూకే విదేశాంగ శాఖ ప్రతినిధులు, బ్రిటిష్ హై కమిషన్ అధికారులు, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ ప్రతినిధులు, ఐఐటీ (ఐఎస్ఎం) ధన్‌బాద్, టెక్స్‌మిన్, కేంద్ర గనుల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పోలవరంతో భద్రాచలానికి ముంపు ప్రమాదం

**హైదరాబాద్, జూన్ 4:**

పోలవరం పూర్తి స్థాయి నీటి మట్టం 45.72 మీటర్లు కాగా, భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి కూడా సరిగ్గా అదే 45.72 మీటర్లు కావడం గమనార్హం.. దీంతో ప్రాజెక్టు పూర్తయితే భద్రాచలానికి ఎల్లప్పుడూ ముంపు ప్రమాదం పొంచివుంటుందని బీఆర్ ఎస్ నేత హరీశ్‌రావు, పీపీఏ సీఈఓకు రాసిన లేఖలో వెల్లడించారు. భద్రాచలం వద్ద గోదావరి నది లోతైన బెడ్ లెవల్ 26 మీటర్లు కాగా, పోలవరం పూర్తయితే బ్యాక్ వాటర్ ప్రభావంతో భద్రాచలంలో ఎప్పుడూ 13.15 మీటర్ల నుంచి 17.72 మీటర్ల మేర నీరు నిలిచి ఉంటుందన్నారు. 2021లో కాఫర్ డ్యామ్ పూర్తయిన తర్వాత వచ్చిన బ్యాక్ వాటర్‌తో 2022లో భద్రాచలం, బూర్గంపాడు, సారపాకల్లో భారీ నష్టం వాటిల్లడమే కాకుండా, భద్రాచలం పట్టణం 40 శాతం జలమయమై, లక్ష మందికి పైగా ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. 2022లో 22 లక్షల క్యూసెక్కులకే ఇంత నష్టం జరిగితే, భవిష్యత్తులో ప్రాజెక్టు డిజైన్ ప్రకారం 36 లక్షల నుంచి 50 లక్షల క్యూసెక్కుల వరద వస్తే తెలంగాణకు ఊహించని ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. కేవలం గ్రామాలకే కాకుండా భారీ పరిశ్రమలకు కూడా బ్యాక్ వాటర్ ముప్పు వున్నదన్నారు. దాదాపు 5 వేల కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న ఐటీసీ పేపర్ బోర్డ్స్, హెవీ వాటర్ ప్లాంట్, దుమ్ముగూడెం జలవిద్యుత్ ప్రాజెక్టులకు అనుక్షణం ప్రమాదం పొంచి వుంటుందన్నారు. ఈ పరిశ్రమలతో పాటు 36 గ్రామాల పరిధిలోని 184 చదరపు కిలోమీటర్ల మేర ముంపు ప్రభావం పడుతోందని ఐఐటీ, వ్యాప్కోస్ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ముంపు వల్ల పదే పదే నష్టపోతున్న సుమారు 2,000 కుటుంబాలకు తక్షణమే నష్టపరిహారంతో పాటు పూర్తి స్థాయి పునరావాసం కల్పించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. భద్రాచలం డ్రైనేజీ వ్యవస్థకు అనుసంధానంగా ఉన్న 8 అవుట్ ఫాల్ రెగ్యులేటర్లు బ్యాక్ వాటర్ ముప్పును ఎదుర్కొంటున్నాయి, కాబట్టి వరద నీటిని గోదావరిలోకి పంపేందుకు తక్షణమే పంపింగ్ స్టేషన్లు, ట్రీట్మెంట్ ప్లాంట్లు నిర్మించాలని కోరారు. భద్రాచలం వద్ద కొత్తగా 5 కిలోమీటర్ల మేర కరకట్టల నిర్మాణం చేపట్టడంతో పాటు, బూర్గంపాడు, సారపాక తదితర ముంపు గ్రామాలకు రక్షణ గోడలు నిర్మించి పరిహారం అందించాలని కోరారు. తెలంగాణలో పోలవరం ముంపు సమస్యల పరిష్కారం, పునరావాస పనుల పర్యవేక్షణ కోసం భద్రాచలంలో వెంటనే ప్రత్యేకంగా పీపీఏ డివిజన్ ఆఫీసును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## మెట్రో వ్యవస్థకు ఎలాంటి నష్టం లేదు..

**మొదటిపేజీ తరువాయి**

మెట్రో రైలు సర్వీసులు ఎప్పటిలాగే పూర్తి సురక్షితంగా, సాధారణంగా పనిచేస్తున్నాయని ఆయన తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే మెట్రో సిబ్బంది అప్రమత్తమై ప్రభావితమైన ఆస్తులపై లోతైన అంచనా వేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో దట్టమైన పొగ వ్యాపించడం వల్ల ప్రయాణికులకు కొంత అసౌకర్యం కలిగిన మాట వాస్తవమేనని, అయితే దీనివల్ల మెట్రో రైలు కార్యకలాపాలకు ఎలాంటి అంతరాయం కలగలేదని, రైళ్ల రాకపోకలు యథావిధిగా కొనసాగాయని ఎండీ వివరించారు. కొన్ని మీడియా సంస్థల్లో వస్తున్న పుకార్లపై ఆయన స్పందిస్తూ.. మెట్రో స్తంభాలపై (పిల్లర్లపై) అమర్చిన ప్రకటనల బోర్డుల వినైల్ షీట్లు మాత్రమే మంటల తీవ్రతకు కాలిపోయాయని, అంతకుమించి మెట్రో వ్యవస్థ యొక్క ప్రధాన నిర్మాణాలు, కట్టడాలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని స్పష్టం చేశారు. అందువల్ల మెట్రో ప్రయాణికులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మెట్రో ప్రయాణం పూర్తిగా సురక్షితమని హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీ శ్రీ సర్ఫరాజ్ అహ్మద్ భరోసా ఇచ్చారు.

## చార్మినార్ వద్ద కేటీఆర్ సందడి

**హైదరాబాద్, జూన్ 5:**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం పాతబస్తీ పర్యటనలో భాగంగా చార్మినార్ సమీపంలోని ప్రముఖ నిమ్రా కేఫ్ అండ్ బేకరీని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రసిద్ధ ఇరానీ చాయ్, ఉస్మానియా బిస్కెట్లను ఆస్వాదించారు.

అనంతరం ఎక్స్ వేదికగా స్పందించిన కేటీఆర్, హైదరాబాద్ పాతబస్తీకి వెళ్లినప్పుడు అక్కడి ఇరానీ చాయ్ తాగకపోతే ఆ పర్యటనకు సంపూర్ణత్వం ఉండదని పేర్కొన్నారు. చార్మినార్ పక్కనే ఉన్న నిమ్రా కేఫ్‌ను సందర్శించి అక్కడి ప్రత్యేక రుచులను ఆస్వాదించడం ఆనందంగా అనిపించిందని తెలిపారు.

కేటీఆర్ రాకతో చార్మినార్ పరిసర ప్రాంతాల్లో సందడి నెలకొంది. ఆయనను చూసేందుకు అభిమానులు, స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు.

# అంగన్‌వాడీలకు సెలవుల పొడిగింపు

**హైదరాబాద్, జూన్ 4:**

రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతున్న నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులను జూన్ 13 వరకు పొడిగించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి ఓఝా, మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఈ ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 14 ఆదివారం కావడంతో జూన్ 15 నుంచి కేంద్రాలు తిరిగి ప్రారంభమవుతాయి.

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 నుంచి 45 డిగ్రీల వరకు నమోదవుతుండటంతో చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరయ్యే చిన్నారులు వడదెబ్బ, డీహైడ్రేషన్ వంటి సమస్యలకు గురయ్యే అవకాశం ఉండటంతో ముందుజాగ్రత్త చర్యగా సెలవులను పొడిగించారు.

అయితే గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాలకు ఎలాంటి అంతరాయం ఉండదని అధికారులు తెలిపారు. సంబంధిత సేవలను ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో ఎబోలా కలకలం

**మొదటిపేజీ తరువాయి**

ఉంచారు. నిర్ధారణ పరీక్షల కోసం అతడి శాంపిల్స్‌ను సీసీఎంబీకి పంపినట్లు అధికారులు తెలిపారు. పరీక్షల ఫలితాలు వచ్చే వరకు వైద్య పర్యవేక్షణలో ఉంచినట్లు తెలుస్తోంది. తెలంగాణలో ఎబోలా అనుమానిత లక్షణాలతో వ్యక్తిని గుర్తించడం ఇదే తొలిసారి కావడంతో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. ఇదిలా ఉండగా, మధ్య ఆఫ్రికాలోని కొన్ని దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి కొనసాగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పలు జాగ్రత్త చర్యలు చేపట్టింది. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై విమానాశ్రయాల్లో ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే వారిని క్షుణ్ణంగా పరీక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ ప్రయాణికుడికి నిజంగా ఎబోలా వైరస్ సోకిందా లేదా అనేది పరీక్షల ఫలితాలు వచ్చిన తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఆరోగ్య శాఖ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం.



## లాసెట్‌లో మాజీ మావోయిస్టు నేత ప్రతిభ

**జగిత్యాల, జూన్ 4:**

మావోయిస్టు ఉద్యమ పంథాను వీడి విద్యను ఆయుధంగా ఎంచుకున్న మాజీ మావోయిస్టు అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ లాసెట్‌లో ప్రతిభ చాటారు. ఇటీవల విడుదలైన లాసెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 349వ ర్యాంకు సాధించి అందరి దృష్టిని ఆకర్షించారు.

జగిత్యాల జిల్లాకు చెందిన దేవ్‌జీ గత నెల 12న కోరుట్లలో నిర్వహించిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు కూడా రాశారు. 50 ఏళ్లు దాటిన వయసులోనూ చదువుపై ఆసక్తి కోల్పోకుండా పట్టుదలతో కృషి చేసి లాసెట్‌లో మెరుగైన ర్యాంకు సాధించడం విశేషంగా నిలిచింది.

న్యాయ విద్యను అభ్యసించి భవిష్యత్తులో న్యాయవాదిగా మారాలని, పేదలు, నిరుపేదలకు ఉచిత న్యాయ సహాయం అందించడమే తన లక్ష్యమని దేవ్‌జీ తెలిపారు.

ఒకప్పుడు అడవుల్లో ఉంటూ ప్రజా సమస్యల కోసం పోరాడిన ఆయన, ఇప్పుడు చట్టబద్ధ మార్గంలో కోర్టుల ద్వారా ప్రజల పక్షాన నిలబడాలని నిర్ణయించుకోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. సమాజంలో మార్పు కోసం విద్యనే సాధనంగా ఎంచుకున్న దేవ్‌జీ విజయం యువతతో పాటు చదువుపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# పల్లెల్లో ఇందిరమ్మ లొల్లి

**మొదటిపేజీ తరువాయి**

కోటా పరిమితంగానే ఉంది. ఒక గ్రామంలో వందలాది మంది అర్హులు దరఖాస్తు చేసుకుంటే, కొద్దిమందికే అవకాశం దక్కుతుండటంతో అసంతృప్తి పెరుగుతోంది. దీంతో ఎవరికి ఇల్లు మంజూరు చేయాలనే అంశం గ్రామాల్లో పెద్ద చర్చగా మారింది.

గ్రామ సభల ద్వారా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రభుత్వం ఆదేశించినా, క్షేత్రస్థాయిలో రాజకీయ ఒత్తిళ్లు పెరుగుతున్నాయని సమాచారం. స్థానిక నాయకులు తమ అనుచరులకు ప్రాధాన్యం కల్పించాలని కోరుతుండగా, అర్హత ప్రమాణాల విషయంలో అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో ఎంపిక జాబితాలపై అభ్యంతరాలు వ్యక్తమవడంతో గ్రామ సభలు వాయిదా పడిన సందర్భాలు కూడా నమోదయ్యాయి.

ఇళ్ల కేటాయింపుల అంశం కాంగ్రెస్ పార్టీలోనే అంతర్గత విభేదాలకు కారణమవుతోంది. పాత నాయకులు, కొత్తగా పార్టీలో చేరిన నేతల మధ్య లబ్ధిదారుల ఎంపికపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామ స్థాయిలో పార్టీ శ్రేణుల మధ్య అసంతృప్తి పెరుగుతుండటంతో స్థానిక నాయకత్వానికి ఇది సవాల్‌గా మారింది.

మరోవైపు ఈ పరిస్థితిని ప్రతిపక్షాలు రాజకీయ అవకాశంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నాయి. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత లేదంటూ ఆరోపణలు చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహిస్తున్నాయి. అర్హులందరికీ న్యాయం జరగడం లేదనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాయి.

పెరుగుతున్న అసంతృప్తిని తగ్గించేందుకు ప్రభుత్వం రెండో విడతలో మరిన్ని ఇళ్ల మంజూరుపై దృష్టి సారించింది. దశలవారీగా అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందిస్తామని ప్రభుత్వం చెబుతోంది. అయినప్పటికీ ప్రస్తుతం గ్రామాల్లో ఇళ్ల కోటా చుట్టూ నెలకొన్న చర్చ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు, లబ్ధిదారుల ఎంపిక వ్యవహారం గ్రామీణ రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం ఈ అసంతృప్తిని ఎలా చక్కదిద్దుతుందన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

ప్రజా శంఖారావం
PRAJA SHANKARAVAM
శుక్రవారం
జూన్ 5, 2026
epaper.prajashankaravam.com
www.prajashankaravam.com



# దంచికొట్టిన వాన

**పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వర్షాలు**

**కరీంనగర్ లో ఇళ్లలోకి చేరిన వరద నీరు**

**ప్రహరీతో పాటు భారీ వృక్షం నేలమట్టం**

**హైదరాబాద్, జూన్ 4:** జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్ తో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. కరీంనగర్ జిల్లా కేంద్రంతో పాటు హుజూరాబాద్ లో మోస్తరు వాన కురిసింది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో గాలి దుమారం, మెరుపులతో కూడిన వర్షం పడింది. ములుగు జిల్లా మల్లంపల్లి, వెంకటాపూర్, ములుగు మండలంలో ఈదురు గాలులతో వాన కురిసింది. కరీంనగర్ నగరంలో కురిసిన భారీ వర్షానికి కాలనీలకు కాలనీలు నీట మునిగాయి. సుభాష్ నగర్, ఆదర్శనగర్ కాలనీలు జలమయం కావడంతో ఇళ్లలోకి వరద నీరు చేరింది. దీంతో స్థానిక కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ సహాయక చర్యలు చేపట్టారు. ప్రొక్లెయినర్ల సహాయంతో డ్రైనేజీలు క్లీన్ చేయించి వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. భారీ వర్షానికి పక్కనే ఉన్న డ్రైనేజీ పొంగి కరీంనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయ ప్రాంగణం అంతా జలమయమైంది. కరీంనగర్ లోని కట్టరాంపూర్ నాగన్న చౌరస్తా దగ్గర ఓ ఇంటి ప్రహరీ కూలింది. గోడతో పాటు పక్కనే ఉన్న భారీ వృక్షం కూడా నేలకొరగడంతో అటుగా నిలిపి ఉన్న కారు స్వల్పంగా దెబ్బతిన్నది. ఈ ఘటనతో భయాందోళనకు గురైన స్థానికులు.. భారీ ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. వర్షాలు పడుతున్న క్రమంలో పాత గోడలు, భారీ వృక్షాల దగ్గర జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ లో పిడుగు పడింది. ఓ స్థానికుడు మొబైల్ తో వర్షాన్ని రికార్డ్ చేస్తుండగా.. సమీపంలోనే పిడుగు పడటంతో తీవ్రంగా ఉలిక్కిపడ్డాడు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు మొబైల్ లో రికార్డయ్యాయి.

# దొర.. సింగిలా? పొత్తా?

**తెలంగాణలో పవన్ పోటీపై ప్రకాశ్ రాజ్ సెటైర్**

**స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన నిర్మాత బండ్ల గణేష్**

**ఎక్స్ వేదికగా తీవ్ర స్థాయికి చేరిన మాటల యుద్ధం**



**హైదరాబాద్, జూన్ 4:** తెలంగాణలో జనసేన పోటీ చేస్తుందంటూ పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై నటుడు ప్రకాశ్ రాజ్ ఎక్స్ వేదికగా సెటైర్ వేశారు. పవన్ ను ఉద్దేశించి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "మీరొస్తామంటే మేమొద్దంటామా.. రండి దొర. సింగిల్ గా వస్తున్నారా.. పొత్తుతో వస్తున్నారా చెప్పి రండి" అని ప్రకాశ్ రాజ్ పోస్ట్ చేశారు. ప్రకాశ్ రాజ్ పోస్ట్ కు నిర్మాత బండ్ల గణేష్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ప్రతి దాంట్లో ఎందుకు వేలు పెడతావంటూ ప్రకాశ్ రాజ్ ను ప్రశ్నించారు. "అసలు నువ్వెవరు.. తమిళోడివా? తెలుగోడివా? కన్నడిగుడివా? ప్రతి విషయంలో జడ్జిమెంట్ ఇవ్వడానికి నువ్వేమైనా ప్రధానివా" అంటూ మండిపడ్డారు. అందరి విషయాల్లో దూరి హీరోలా ఫీలవ్వొద్దని బండ్ల గణేష్ హితవు పలికారు. ముందు నీ అడ్రస్ నువ్వు తెలుసుకోవాలని, ఆ తర్వాత ప్రపంచాన్ని మార్చే ప్రయత్నం చేయాలని ప్రకాశ్ రాజ్ కు చురకలంటించారు. ప్రస్తుతం ప్రకాశ్ రాజ్, బండ్ల గణేష్ మధ్య సోషల్ మీడియా ఎక్స్ వేదికగా జరుగుతున్న ఈ వార్ తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు గ్రీన్ సిగ్నల్

**ఆదిలాబాద్,జూన్4:** ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది . ఎయిర్ పోర్టుకు 1580 ఎకరాలు ఇవ్వడానికి సిద్ధమైన రాష్ట్ర సర్కార్ ప్రతిపాదన లేఖను రక్షణ శాఖ జాయింట్ సెక్రెటరీ మహంతికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ అందించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన లేఖ పట్ల సానుకూలత తెలిపింది కేంద్రం. రక్షణ శాఖ చెందిన 400 ఎకరాలు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే1580 ఎకరాలు కలిపి1980 ఎకరాల్లో ఎయిర్ ఫోర్స్ స్టేషన్, ఎయిర్ పోర్టు నిర్మాణానికి సానుకూలంగా ఉన్నట్లు కేంద్రం తెలిపింది. కేంద్రం నిర్ణయంపై సంతోషం వ్యక్తం చేశారు ఎమ్మెల్యే పాయల్ శంకర్. ఎయిర్ పోర్ట్ నిర్మాణంపై సానుకూలంగా ఉన్న ప్రధాని మోడీ, సీఎం రేవంత్ కు ఎమ్మెల్యే పాయల్ శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

## రైతులకు భరోసా ఏది? జీవన్ రెడ్డి

**జగిత్యాల, జూన్ 4 :** రాష్ట్ర ప్రజానీకంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందుచూపు కరువైందని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆరోపించారు. వానకాలం పంట సీజన్ మరికొద్ది రోజుల్లో ప్రారంభమవుతున్నా ప్రభుత్వానికి ముందస్తు కార్యాచరణ ప్రణాళిక లేదని విమర్శించారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట రుణాలకు సంబంధించి ప్రభుత్వం ఇంకా ఎలాంటి కార్యాచరణ రూపొందించలేదని జీవన్ రెడ్డి ఆరోపించారు. కనీసం ఈ ఖరీఫ్ పంటకైనా రైతు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి పాలనలో ఎన్ని పంటలకు రైతు భరోసా కల్పించారో ఆయన ఆత్మకే తెలుసని ఎద్దేవా చేశారు. ధాన్యం సేకరణపై కాంగ్రెస్, బీజేపీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నాయే తప్ప రైతుల గురించి ఆలోచించడం లేదని జీవన్ రెడ్డి విమర్శించారు. పప్పు దినుసులు, నూనె గింజలు పండించాలని సలహా ఇస్తున్న ప్రభుత్వం.. వాటికి ఏ విధమైన ప్రోత్సాహం కల్పిస్తుందో చెప్పడం లేదని ప్రశ్నించారు. కోతుల బెడద నుంచి పంటలను కాపాడేందుకు కోతుల పునరుత్పత్తి నిలుపుదల కేంద్రాన్ని జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలని జీవన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే రైతులకు 50 శాతం రాయితీతో సోలార్ ఫెన్సింగ్ ఇవ్వాలని కోరారు. మార్కెట్లో యూరియా అందుబాటులో లేదని, వెంటనే యూరియా యాప్ ను తొలగించి నేరుగా రైతులకు అందించాలని స్పష్టం చేశారు.

# కొడంగల్ ఎత్తిపోతలతో లక్ష ఎకరాలకు సాగునీరు

- ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలి
- రైతులకు సకాలంలో సాగునీరు అందించడమే లక్ష్యం
- కాట్రేవుపల్లి పంప్‌హౌస్ వద్ద కాంక్రీటు పనులు ప్రారంభించాలి
- సోమశిలలో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష
- ఎత్తిపోతల పథకం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలన
- మంత్రులతో కలిసి ఏరియల్ సర్వే
- నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి కావాలని స్పష్టీకరణ



**నారాయణపేట/మహబూబ్‌నగర్, జూన్ 4 :** మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం, ఇందులో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలనలు, సమీక్షలను ముమ్మరం చేసింది. గురువారం బెంగళూరు నుంచి నేరుగా మక్తల్ చేరుకున్న ముఖ్యమంత్రికి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలకు జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మక్తల్ మండలం కాట్రేవుపల్లి గ్రామ సమీపంలో కొనసాగుతున్న మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల ప్యాకేజీ-1 పనులను స్వయంగా పరిశీలించారు. ప్యాకేజీ-1 లో భాగంగా జరుగుతున్న పంప్‌హౌస్ పనుల పురోగతి ఎంత శాతం పూర్తయిందనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ తక్షణమే కాంక్రీటు పనులను ప్రారంభించి, పనుల వేగాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు భీమా, కృష్ణా నదులపై ప్రతిపాదించిన బ్యారేజీ పనుల పురోగతికి సంబంధించిన ప్లాన్ మ్యాప్స్, ఫోటో ఎగ్జిబిషన్‌ను ఇరిగేషన్ అధికారులు ముఖ్యమంత్రికి వివరించగా, ఆయన దానిని క్షుణ్ణంగా వీక్షించారు. మక్తల్ పర్యటన అనంతరం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై సోమశిలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కీలక భేటీలో రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డిలతో పాటు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమీక్షకు ముందు ముఖ్యమంత్రి మరియు మంత్రుల బృందం పాలమూరు జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను ఆకాశ మార్గం (ఏరియల్ సర్వే) ద్వారా క్షుణ్ణంగా పరిశీలించింది. ముఖ్యంగా కోయిల్ సాగర్ ప్రాజెక్టు, జూరాల ప్రాజెక్టు డ్యామ్, అలాగే కృష్ణా-భీమా నదులపై ప్రతిపాదించిన నూతన బ్యారేజీల స్థలాలను సీఎం రేవంత్ రెడ్డి ఆకాశ మార్గం నుండి వీక్షించారు. ఆయా ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులు, నీటి నిల్వ సామర్థ్యాలపై అధికారులతో ఆరా తీశారు. ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గ పరిధిలోని కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ఈ ప్రాంతానికి సాగునీరు అందించడంలో అత్యంత కీలకమైన కాట్రేవుపల్లి పంప్‌హౌస్ నిర్మాణ శైలిని, దాని పురోగతిని ప్రత్యేకంగా పర్యవేక్షించారు. ఏరియల్ సర్వే మరియు సమీక్ష అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడుతూ.. పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని సాగునీటి ప్రాజెక్టుల పనులను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి జాప్యం లేకుండా, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మంత్రుల బృందం కూడా ప్రాజెక్టుల వారీగా ఉన్న సాంకేతిక, ఇతర అడ్డంకులను వెంటనే తొలగించి, పనులను త్వరగా ముగించాలని అధికారులకు సూచించింది. ఈ కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజు, తెలంగాణ ఇరిగేషన్ కార్యదర్శి శ్రీధర్, చీఫ్ ఇంజనీర్ ఏ. సత్యనారాయణ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ హెచ్.టి. శ్రీధర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ఉద్యమకారులకు న్యాయం చేస్తాం!

- అమరవీరుల స్తూపం నుంచి ప్రక్రియ ప్రారంభం
- ఆన్ లైన్, ఆఫ్ లైన్ ద్వారా విజ్ఞప్తుల స్వీకరణ
- సచివాలయంలో ముగిసిన అఖిలపక్ష భేటీ
- త్వరలో విద్యార్థి, ఉద్యమ సంఘాలతో సమావేశాలు
- అందరి అభిప్రాయాలతోనే జాబితా రూపకల్పన
- వివరాలు వెల్లడించిన కేశవరావు, పొన్నం, కోదండరాం



**హైదరాబాద్, జూన్ 4:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న ఉద్యమకారులందరికీ న్యాయం చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని గుర్తింపు కమిటీ చైర్మన్ కేశవరావు స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ఆయన అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ గురువారం హైదరాబాద్ సచివాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. సమావేశం అనంతరం కేశవరావు మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉద్యమకారుల సంఘాలతో మళ్లీ సమావేశమవుతామని చెప్పారు. అందుకోసం వారందరినీ పిలిచి మాట్లాడుతామని పేర్కొన్నారు. తెలంగాణ తొలి దశతో పాటు మలి దశ ఉద్యమకారులందరికీ న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోందని స్పష్టం చేశారు. ఈ అఖిలపక్ష సమావేశంలో అన్ని పార్టీల నేతలు పాల్గొన్నారని ఆయన వెల్లడించారు. ఉద్యమకారులకు న్యాయం చేసేందుకు రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నష్టపోయిన అందరికీ అండగా ఉంటామని చెప్పారు. అఖిలపక్షం నుంచి ఒక్కో పార్టీకి ఇద్దరు ప్రతినిధులను ఆహ్వానించామని పేర్కొన్నారు. పార్టీలు మాత్రమే కాకుండా ఉద్యోగ, విద్యార్థి, జర్నలిస్టు, న్యాయవాదులు, కవులు, కళాకారులు తదితరులను పిలిచి మాట్లాడుతామని వివరించారు. అమరవీరుల స్తూపం వద్ద ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఉద్యమకారుల గుర్తింపు కోసం ఆన్ లైన్, ఆఫ్ లైన్ ద్వారా విజ్ఞప్తులు స్వీకరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఉద్యమ సమయంలో తమ యవ్వనం కోల్పోయామని, తమను ఆదుకోవాలని ఉద్యమకారులు కోరుతున్నారని ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు. అందుకోసం ఉద్యమకారుల జేఏసీలు, యూనివర్సిటీ జేఏసీలతో త్వరలో సమావేశమవుతామని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సంఘాలు, కుల సంఘాలతో పాటు అన్ని వర్గాలను సంప్రదిస్తామని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ వెల్లడించారు. అందరి సలహాలు తీసుకోవాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన అని చెప్పారు. అందరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుని అర్హులైన ఉద్యమకారులను గుర్తిస్తామని ఆయన పేర్కొన్నారు.

# పవన్ తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడారా?

- జనసేన మీటింగ్ కు అనుమతెందుకు ఇవ్వలేదు?
- పవన్ పై విమర్శలకు ముందు పాత చరిత్రను గుర్తుంచుకోవాలి
- సెంటిమెంట్ రాజకీయాలతో బీఆర్ఎస్, కాంగ్రెస్ డ్రామాలు
- సభ పెట్టుకోవడం ప్రజాస్వామ్య హక్కు.. దాన్ని అడ్డుకుంటారా?
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు



**హైదరాబాద్, జూన్ 4:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా ఎప్పుడూ మాట్లాడలేదని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. ఆయన మీటింగ్ కు అనుమతి ఇస్తే ఏమవుతుందని రామచందర్ రావు ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్ లో రామచందర్ రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సెంటిమెంట్ ను మరోసారి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల తీరుపై మండిపడ్డారు. తెలంగాణను వ్యతిరేకించిన ఎంఐఎంను ఎందుకు దగ్గరకు తీసుకున్నారని ప్రశ్నించారు. తెలంగాణ సెంటిమెంట్ పేరుతో మళ్లీ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆగ్రహించారు. తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడిన వారితో చేతులు కలిపింది ఎవరో బీఆర్ఎస్ నేతలు చెప్పాలని నిలదీశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని శక్తులతో అధికార రాజకీయాలు చేసింది ఎవరని ప్రశ్నించారు. తెలంగాణను తిట్టిన వారిని, ఉద్యమకారులను అవమానించిన వారిని బీఆర్ఎస్ లో చేర్చుకుని పదవులు ఇచ్చింది ఎవరని నిలదీశారు. తెలంగాణ పేరుతో రాజకీయాలు చేసే ముందు మీ రాజకీయ చరిత్రను ఒక్కసారి ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం మీద ప్రేమ ఉంటే డ్రామాలు కాదని, నిజాలు మాట్లాడాలని సవాల్ విసిరారు. ప్రజలు ఇప్పుడు భావోద్వేగాలకు కాదని, గతానికి కూడా లెక్క అడిగే స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ జనసేన సభ కోసం అనుమతి అడిగారని, ఇచ్చి ఉంటే కథ అక్కడే ముగిసేదన్నారు. సభకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో కాంగ్రెస్ సర్కార్ చెప్పాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు. సమావేశం పెట్టుకోవడం ప్రతి ఒక్కరి ప్రజాస్వామ్య హక్కు అని చెప్పారు. దాన్ని అడ్డుకోవడం ఎందుకు జరిగిందో సమాధానం చెప్పాలని నిలదీశారు. పవన్ కల్యాణ్ అంశాన్ని బీజేపీ మీద రుద్దే ప్రయత్నం చేయడం రాజకీయ దివాళాకోరుతనమని ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కలిస్తేనే కొందరి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. తెలంగాణను వ్యతిరేకించిన వారికి కేసీఆర్ హయాంలో మంత్రి పదవులు ఇచ్చారని రామచందర్ రావు ఆగ్రహించారు. ఏపీలో బీఆర్ఎస్ ఆఫీస్ పెట్టలేదా? అని ప్రశ్నించారు. తెలంగాణ నిధులను పంజాబ్ లో కేసీఆర్ పంచలేదా? అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించలేని పరిస్థితిలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉందని విమర్శించారు. బీజేపీ సపోర్ట్ చేయడంతోనే తెలంగాణ వచ్చిందని పేర్కొన్నారు. ఆనాడు పార్లమెంటులో తమ పార్టీ మద్దతు ప్రకటించిందని గుర్తుచేశారు. సుష్మా స్వరాజ్ బేషరతుగా మద్దతు ఇస్తేనే తెలంగాణ వచ్చిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ సర్కార్ ఇస్తానని చెప్పిన జాబ్ క్యాలెండర్ ఏమైందని రామచందర్ రావు ప్రశ్నించారు. 12 ఏళ్ల నుంచి నీళ్ల మీద ఒక్క పాలసీ కూడా ఎందుకు తేలేదని నిలదీశారు. తెలంగాణకు రావాల్సిన నీళ్ల వాటా కంటే తక్కువ వాటాను కేసీఆర్ ఒప్పుకున్నారని ప్రస్తావించారు. రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జలాలను డీకే శివకుమార్ కు రేవంత్ రెడ్డి బహుమతిగా ఇచ్చారని విమర్శించారు. మిగులు బడ్జెట్ గా ఉన్న తెలంగాణను అప్పుల్లోకి నెట్టారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ సూపర్ హీరో అని రామచందర్ రావు అభివర్ణించారు. రానున్న రోజుల్లో బీజేపీ తెలంగాణలో కీలకంగా మారుతుందన్నారు.

# అనాథ పిల్లలను రోడ్డున పడేసిన ఘటనపై ఆగ్రహం.....!

- తపస్వి స్వచ్ఛంద సంస్థకు అండగా నిలవాలని ప్రజల విజ్ఞప్తి
- యజమానికి వత్తాసు పలుకుతున్న పోలీస్ డిపార్ట్మెంట్.?
- కలెక్టర్ స్పందించి తక్షణమే పిల్లలకు న్యాయం చేయాలి






**ఆర్మూర్ జూన్ 4 (ప్రజా శంఖారావం):**

ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోనీ మామిడిపల్లి ప్రాంతంలో ఉన్న ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ తపస్విలో ఆశ్రయం పొందుతున్న అనాధ పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నో ఏళ్లుగా అనాధ, నిరుపేద పిల్లలకు ఆశ్రయం, విద్య, భోజనం వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ సేవలందిస్తున్న ఈ సంస్థ ప్రస్తుతం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం.సంస్థ నిర్వహణ వర్గాల కథనం ప్రకారం, నిధుల కొరత కారణంగా అద్దె చెల్లింపుల్లో జాప్యం ఏర్పడటంతో భవన యజమానిని కొంత గడువు ఇవ్వాలని కోరగా, పోలీసుల సమక్షంలో జూన్ 10వ తేదీ వరకు సమయం ఇవ్వాలని అంగీకారం జరిగినట్లు చెబుతున్నారు. అయితే గడువు ముగియకముందే సదరు భవన యజమాని ప్రభుత్వ ఉద్యోగి, ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న హరిజీవన్, కొందరితో కలిసి వచ్చి పిల్లలు నివసిస్తున్న ప్రాంగణాన్ని ఖాళీ చేయిస్తూన్నారన్నారు. గురువారం రోజు 5గురు వ్యక్తులను తీసుకొని వచ్చి పిల్లలు ఉపయోగిస్తున్న మరుగుదొడ్లు, బాత్రూమ్‌లను ధ్వంసం చేశారని, అడ్డుకునేందుకు ప్రయత్నించిన సంస్థ సభ్యుడు శ్రీనివాసరావుపై వారు దాడి చేసినట్లు సంస్థ సభ్యులు తెలిపారు. ఈ ఘటనతో చిన్నారులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా తపస్వి సంస్థకు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సేవకులు, దాతలు వచ్చి పిల్లలకు సహాయం అందిస్తూ ప్రోత్సహించిన సందర్భాలు అనేకం ఉన్నాయని స్థానికులు గుర్తుచేస్తున్నారు. అలాంటి సమయంలో ప్రస్తుతం సంస్థ సంక్షోభంలో ఉన్నప్పటికీ ప్రముఖులు స్పందించకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అనాధ పిల్లల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగం, జిల్లా కలెక్టర్ స్పందించి తక్షణమే పిల్లలకు న్యాయం చేయాలనీ ప్రజలు అంటున్నారు. ప్రజాప్రతినిధులు, దాతలు వెంటనే స్పందించి సంస్థకు అవసరమైన సహాయం అందించాలని, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## అధికారులతో కొనసాగిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక



**ఆర్మూర్ జూన్ 4(ప్రజా శంఖారావం):**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని అంగడి బజార్ వద్ద గల బాలాజీ ఫంక్షన్ హాల్లో ఆర్మూర్ మున్సిపల్ పురపాలక సంఘం 1,2,3, 14, 15, 16, 17, 18, 19, 35, 36 వార్డులకు సంబంధించిన వార్డు సభ పురపాలక సంఘం ఆర్మూర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని ప్రభుత్వ అధికారులు నిర్వహించారు. ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ గోనె లహరి, మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. ఇందిరమ్మ గృహాలపై నివృత్తి, ఇండ్లు కట్టుకునే స్థలాలు ఉన్నవారికి ఏవిధంగా కట్టుకోవాలని అవగాహన, పెన్షన్లకు సంబంధించిన వారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర రెడ్డి, మాట్లాడుతూ ప్రశాంతత ఉండాలంటే శాంతిభద్రతలు ముఖ్యమని అన్నారు. పట్టణంలో సిసి కెమెరాల ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. నేరాలు అదుపు చేయడానికి దొంగతనాలు జరగకుండా ఇవి ఎంతో ఉపయోగంగా ఉంటాయని అన్నారు. పట్టణంలో కోటి రూపాయల చోరీ జరిగితే సీసీ కెమెరా వలన దానిని నాలుగైదు రోజులలోనే సీసీ కెమెరాల ద్వారా చేధించడం జరిగిందని అన్నారు. మా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మన కాలనీ మన భద్రత మన బాధ్యత ట్రాఫిక్ నియమాల పైన మత్తు పదార్థాల పైన సైబర్ నెలల పట్ల అవగాహన కార్యక్రమంలో నిర్వహిస్తున్నమన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ పి సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, వైస్ చైర్మన్ కాటిపల్లి వెంకటరెడ్డి, మునిసిపల్ కౌన్సిలర్లు బాత్ నాతే తిరుమల సుమన్, సడక్ వినోద్, నాగేంద్ర, చెంచు శ్రావణ్, అగ్రికల్చర్ అధికారి హరికృష్ణ, ఇరిగేషన్ ఏఈ పవన్, ఎక్సైజ్ ఎస్సై ప్రమోద్, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

## బడిబాట

**ఆర్మూర్ జూన్ 4(ప్రజా శంఖారావం):**

ఆర్మూర్ లోని పెర్కిట్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం ప్రాథమిక ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు కొటార్మూర్ గ్రామ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలోనే ప్రవేశం పొందాలని ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పిస్తుందని అవగాహన కల్పిస్తూ బడిబాటను నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ లత ప్రసాద్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# డీలిమిటేషన్‌కు కేంద్రం అడుగులు

- 2029 ఎన్నికల ముందే పునర్విభజన లక్ష్యం
- రాజకీయ పార్టీలతో సంప్రదింపులు
- దక్షిణాది ఆందోళనలకు పరిష్కార ప్రయత్నాలు
- పార్లమెంట్‌లో కొత్త బిల్లు తెచ్చేందుకు కసరత్తు



**న్యూఢిల్లీ, జూన్ 4:** దేశంలోని పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించినట్లు సమాచారం. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే డీలిమిటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలనే లక్ష్యంతో రాజకీయ పార్టీలతో సంప్రదింపులు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అవసరమైన చట్టపరమైన మార్పులపై కూడా కేంద్రం దృష్టి సారించినట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం దేశంలో లోక్‌సభ స్థానాల కేటాయింపు 1971 జనాభా లెక్కల ఆధారంగా కొనసాగుతోంది. గత కొన్ని దశాబ్దాలుగా జనాభాలో భారీ మార్పులు చోటుచేసుకున్న నేపథ్యంలో తాజా పరిస్థితులకు అనుగుణంగా నియోజకవర్గాల పునర్విభజన అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో కొత్త డీలిమిటేషన్ ప్రక్రియకు మార్గం సుగమం చేసే బిల్లును కేంద్రం తీసుకురావచ్చని ప్రచారం జరుగుతోంది. పునర్విభజన అమలులోకి వస్తే పలు రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్యలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. జనాభా పెరుగుదల అధికంగా ఉన్న రాష్ట్రాలకు అదనపు ప్రాతినిధ్యం లభించే అవకాశముండగా, కొన్ని రాష్ట్రాల్లో ప్రస్తుత రాజకీయ సమీకరణాలు మారే పరిస్థితి ఏర్పడవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ అంశంపై విస్తృత రాజకీయ ఏకాభిప్రాయం సాధించేందుకు కేంద్రం ప్రాంతీయ పార్టీలతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. పలు రాష్ట్రాలకు చెందిన ప్రధాన రాజకీయ పార్టీల అభిప్రాయాలను తెలుసుకుని వివాదాలకు తావులేకుండా ముందుకు సాగాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే డీలిమిటేషన్ ప్రతిపాదనపై దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జనాభా నియంత్రణలో మెరుగైన ఫలితాలు సాధించిన రాష్ట్రాలకు నష్టం కలగకూడదనే అభిప్రాయం అక్కడి రాజకీయ పార్టీల్లో వ్యక్తమవుతోంది. ఈ ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని అన్ని రాష్ట్రాలకు న్యాయం జరిగేలా సమతుల్య విధానాన్ని రూపొందించేందుకు కేంద్రం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. రాజకీయ పార్టీలతో సంప్రదింపులు పూర్తైన తర్వాత డీలిమిటేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశముందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ ప్రక్రియ పూర్తయితే దేశ రాజకీయ పటంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

# రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ విమర్శలు

**ఆర్థిక సంక్షోభ హెచ్చరికపై దుమారం**
**ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని ఆరోపణ**
**దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందన్న బీజేపీ**



**న్యూఢిల్లీ, జూన్ 4 :** దేశంలో త్వరలోనే ఆర్థిక సంక్షోభం తలెత్తే అవకాశం ఉందని, పరిస్థితులు మరింత దిగజారితే అత్యవసర పరిస్థితుల తరహా పరిణామాలు చోటుచేసుకోవచ్చని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తూ, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నమని ఆరోపించింది. కాంగ్రెస్ గిరిజన విభాగం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడిన రాహుల్ గాంధీ దేశంలో ధరలు పెరుగుతున్నాయని, సామాన్య ప్రజలపై ఆర్థిక భారం అధికమవుతోందని అన్నారు. గతంలో దేశాన్ని ఆర్థిక ఒత్తిళ్ల నుంచి కాపాడిన పలు వ్యవస్థలు బలహీనపడ్డాయని ఆరోపించారు. ప్రజల అసంతృప్తిని అణచివేసేందుకు ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని కూడా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన బీజేపీ నాయకులు రాహుల్ గాంధీ వ్యాఖ్యలను నిరాధార ఆరోపణలుగా కొట్టిపారేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటోందని, భారత ఆర్థిక పరిస్థితి పటిష్టంగా ఉందని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి సూచీలు, పెరుగుతున్న పెట్టుబడులు, పారిశ్రామిక వృద్ధి, విదేశీ మారక నిల్వలు ఆర్థిక బలానికి నిదర్శనమని వివరించారు. బీజేపీ ఐటీ విభాగం జాతీయ ఇన్‌ఛార్జి అమిత్ మాలవీయ సామాజిక మాధ్యమాల వేదికగా స్పందిస్తూ, రాహుల్ వ్యాఖ్యలు ప్రజల్లో భయాన్ని పెంచే ప్రయత్నమని విమర్శించారు. గత పదేళ్లలో దేశ ఆర్థిక రక్షణ వ్యవస్థలు మరింత బలపడ్డాయని, ద్రవ్యోల్బణం నియంత్రణ, పెరుగుతున్న విద్యుత్ వినియోగం, వాహన విక్రయాలు, విదేశీ మారక నిల్వలు వంటి అంశాలు దేశ ఆర్థిక స్థిరత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్రమంత్రి లలన్ సింగ్ కూడా రాహుల్ వ్యాఖ్యలపై స్పందించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని, ప్రజాస్వామ్య విలువలకు ప్రధాని నరేంద్ర మోదీ కట్టుబడి ఉన్నారని అన్నారు. గతంలో దేశంలో అమలైన అత్యవసర పరిస్థితులను గుర్తు చేస్తూ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు, వాటిపై బీజేపీ నేతల ప్రతిస్పందనతో దేశ రాజకీయాల్లో మరోసారి ఆర్థిక వ్యవస్థ, ప్రజాస్వామ్య పరిరక్షణ అంశాలు చర్చకు వచ్చాయి. ఇరు పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతుండగా ఈ అంశం జాతీయ రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

# జూన్ 6 నిరసనపై దుమారం

**'అడ్డుకుంటే అల్లర్లు' వ్యాఖ్యలతో వైరల్ వీడియో.. సీజేపీ చుట్టూ వివాదం**

**న్యూఢిల్లీ:** ఈ నెల 6న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి ముందు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)కి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీసింది. పార్టీ మద్దతుదారుడిగా చెప్పబడుతున్న ఓ వ్యక్తి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. వైరల్ అవుతున్న వీడియోలో అమిత్ కుమార్ సింధ్ అనే వ్యక్తి మాట్లాడుతూ, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకుంటే అక్కడే అల్లర్లు చెలరేగే అవకాశం ఉందని వ్యాఖ్యానించినట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే నిరసనలో పాల్గొనేవారు తమ రక్షణ కోసం పెప్పర్ స్ప్రేలు, కర్రలు వెంట తెచ్చుకోవాలని సూచించినట్లు వీడియోలో కనిపిస్తోంది. పోలీసులు నిరసన కార్యక్రమాన్ని అడ్డుకునే అవకాశం ఉందని, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చినట్లు తెలుస్తోంది. వీడియోలోని మరో భాగంలో "ఇప్పటివరకు చాలా భరించాం.. ఈసారి హద్దులు దాటుతాం" అంటూ చేసిన వ్యాఖ్యలు మరింత వివాదానికి కారణమయ్యాయి. దీంతో సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈ నెల 6న భారత్‌కు రానున్నట్లు సమాచారం. అనంతరం పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి జంతర్‌మంతర్ వద్ద నిరసన కార్యక్రమానికి అనుమతి కోరనున్నట్లు తెలిసింది. వైరల్ వీడియోపై వివాదం నెలకొన్న నేపథ్యంలో స్పందించిన అభిజీత్ దీప్కే, తమ ఉద్యమం పూర్తిగా శాంతియుత పద్ధతుల్లోనే కొనసాగుతుందని స్పష్టం చేశారు. భారత రాజ్యాంగంపై తనకు పూర్తి విశ్వాసముందని, ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచే హక్కు ఉందని పేర్కొన్నారు. అయితే వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో జూన్ 6న జరగనున్న నిరసన కార్యక్రమంపై పోలీసు వర్గాలు అప్రమత్తంగా ఉన్నట్లు తెలుస్తోంది. నిరసన శాంతియుతంగా, చట్టబద్ధమైన పరిమితుల్లోనే కొనసాగుతుందా లేదా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# ఎయిర్‌పోర్టులో భారీ విదేశీ కరెన్సీ స్వాధీనం

- ముంబై సీఐఎస్ఎఫ్ అప్రమత్తతతో వెలుగులోకి ఘటన
- కోటి ముప్పై తొమ్మిది లక్షల విలువైన డాలర్లు గుర్తింపు




**ముంబై, జూన్ 4:** ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం సిబ్బంది అప్రమత్తతతో భారీ మొత్తంలో విదేశీ కరెన్సీ పట్టుబడింది. సాధారణ భద్రతా తనిఖీల సమయంలో ఎక్స్-రే సామగ్రి పరిశీలన వ్యవస్థలో అనుమానాస్పద వస్తువు గుర్తించడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. సీఐఎస్ఎఫ్ సిబ్బంది ప్రయాణికుడి చేతి సామానును క్షుణ్ణంగా తనిఖీ చేయగా, ప్రకటించని విదేశీ కరెన్సీ బయటపడింది. మొత్తం లక్షా నలభై ఐదు వేల అమెరికన్ డాలర్లు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. భారత కరెన్సీలో దీని విలువ సుమారు కోటి ముప్పై తొమ్మిది లక్షల రూపాయలుగా అంచనా వేస్తున్నారు. ఈ విదేశీ కరెన్సీని తీసుకెళ్తున్న వ్యక్తి విదేశీ పౌరుడిగా గుర్తించారు. అతను ముంబై నుంచి అడిస్ అబాబా నగరానికి ప్రయాణిస్తున్న సమయంలో ఈ తనిఖీలు నిర్వహించారు. అవసరమైన అనుమతులు లేకుండా భారీ మొత్తంలో విదేశీ కరెన్సీ తరలించే ప్రయత్నం చేసినట్లు అధికారులు గుర్తించారు. వెంటనే ఆ వ్యక్తిని, స్వాధీనం చేసుకున్న కరెన్సీతో పాటు కస్టమ్స్ అధికారులకు అప్పగించినట్లు సీఐఎస్ఎఫ్ తెలిపింది. ఈ ఘటనపై కస్టమ్స్ శాఖ అధికారులు తదుపరి విచారణ చేపట్టారు. విమానాశ్రయ భద్రతలో భాగంగా నిర్వహించే తనిఖీల్లో సీఐఎస్ఎఫ్ సిబ్బంది చూపిన అప్రమత్తత వల్ల ఈ అక్రమ రవాణా యత్నం విఫలమైందని అధికారులు పేర్కొన్నారు. దేశ భద్రత, ఆర్థిక నేరాల నిరోధంలో భద్రతా బలగాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. అంతర్జాతీయ విమానాశ్రయాల్లో భద్రతా తనిఖీలు మరింత కట్టుదిట్టంగా కొనసాగుతున్నాయని, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ఎలాంటి రాజీ ఉండదని అధికారులు స్పష్టం చేశారు.

# రాజ్యసభ ఎన్నికల అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ

**ఢిల్లీ:** రాజ్యసభ ఎన్నికలు, ఒడిశా ఉప ఎన్నికకు సంబంధించి బీజేపీ తన అభ్యర్థుల జాబితాను గ్నురువారం ప్రకటించింది. మొత్తం 11 మంది అభ్యర్థులతో జాబితాను ప్రకటించింది. రాజస్థాన్ నుంచి రాజ్యసభ ఎంపీ అభ్యర్థులుగా సతీశ్ పూనియా, అల్కా గుర్జర్, మధ్యప్రదేశ్ నుంచి తరుణ్ చుగ్, రజనీశ్ అగ్రవాల్, అరుణాచల్ ప్రదేశ్ నుంచి తాయ్ తాగాక్, మణిపూర్ నుంచి శారదా దేవిని బరిలోకి దింపింది. గుజరాత్ నుంచి రాజూభాయ్ శుక్లా, ముకేశ్‌భాయ్ రాఠ్వా, మాన్‌సింగ్ పర్మార్, జితేంద్రసింగ్, మేఘ్‌జీభాయ్ కంజారియా బరిలో నిలిచారు. ఇక ఒడిశా రాజ్యసభ ఉపఎన్నికలో దేబాశిష్ సామంతరాయ్‌ను రంగంలోకి దించింది. జూన్ 18న ఎగువ సభకు ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ రాష్ట్రాల్లో బీజేపీకి మెజారిటీ ఉన్న నేపథ్యంలో అభ్యర్థుల విజయం నల్లేరు మీద నడకే అని విశ్లేషకులు అంటున్నారు. 245 సభ్యులున్న రాజ్యసభలో ఎన్డీయే కూటమి సంఖ్యా బలం 148కాగా, బీజేపీ ఎంపీలు 113 మంది ఉన్నారు. ఇక రాజ్యసభ ఎంపీలు హర్దీప్ సింగ్ పురీ, దినేశ్ శర్మ, అరుణ్ సింగ్, ప్రొఫెసర్ రామ్ గోపాల్ యాదవ్‌ల పదవీ కాలంలో కూడా నవంబర్‌లో పూర్తికానుంది.

ప్రజా శంఖారావం
PRAJA SHANKARAVAM
శుక్రవారం
జూన్ 5, 2026
epaper.prajashankaravam.com
www.prajashankaravam.com

## ధ్యాన మందిరంలో భక్తి పారవశ్యం



**భీంగల్, మే 4 (ప్రజా శంఖారావం):**

వేల్పూర్ సాయి సన్నిధిలో గురువారం వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. ప్రభాత వేళ ఆలయ అర్చకుడు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు. అనంతరం అన్నదాతల సమక్షంలో గోమాత పూజ, అన్నదాన పూజ చేపట్టారు. ధ్యాన మందిరంలో మూడు గంటల పాటు భజన కళాకారులు మధురమైన భక్తిగీతాలు ఆలపిస్తూ భక్తులను ఆధ్యాత్మిక పరవశ్యంలో ముంచెత్తారు. కమిటీ సభ్యులు, సాయి సేవకుల ఆధ్వర్యంలో అన్నదాతలు సాయి పల్లకిని ధ్యాన మందిరం నుంచి ప్రారంభించి ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాల వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. పల్లకి సేవలో పలు గ్రామాలకు చెందిన భజన కళాకారులు పాల్గొని భక్తిగీతాలతో అలరించారు. వేల్పూర్‌కు చెందిన బర్రె లక్ష్మి–ఆనంద్, గంట లక్ష్మి ప్రసన్న–వినీత్ దంపతులు, బాచన్‌పల్లికి చెందిన దివంగత ఎల్లుల్ల నర్సయ్య జ్ఞాపకార్థం భాగ్యలక్ష్మి కుటుంబ సభ్యులు, సీతారాంపల్లెకు చెందిన డంగు యాజ్ఞవల్క్య కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాతలను కమిటీ సభ్యులు సన్మానించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

## స్ప్రింట్ డయాగ్నస్టిక్ తొలి వార్షికోత్సవ వేడుకలు




**కుత్బుల్లాపూర్, జూన్ 4 (ప్రజా శంఖారావం):**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జీడిమెట్ల డివిజన్ సుచిత్రలో ఉన్న స్ప్రింట్ దయాగ్నస్టిక్స్ తొలి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ శాసనసభాపక్ష విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో వేగంగా వస్తున్న సాంకేతిక మార్పులను అందిపుచ్చుకుంటూ రోగ నిర్ధారణ, చికిత్సలో బయో ఫైర్ వంటి నూతన సాంకేతికతను వినియోగించి అత్యుత్తమ సేవలు అందించడం సంస్థ సేవా దృక్పథానికి నిదర్శనమన్నారు. ఆధునిక సాంకేతికతతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న స్ప్రింట్ దయాగ్నస్టిక్స్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం స్ప్రింట్ దయాగ్నస్టిక్స్ ఆధ్వర్యంలో రూపొందించిన 'వెల్‌నెస్ ఫ్యామిలీ కార్డు'ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ ఎండీ డాక్టర్ భరత్ రెడ్డి, సీవోవో తరుణ్ ఆదిత్య, డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ కార్తీక్, ల్యాబ్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మితో పాటు బీఆర్ఎస్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నరేందర్ రెడ్డి, సమ్మయ్య నేత, ఆటో బలరాం, నదీమ్ రాయ్, కాలే గణేష్, బాల మల్లేష్, శ్రీకాంత్, విజయ్ హరీష్, డీజే రమేష్, బాబీ, మహేష్, ఇందిరా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భావి తరాలకు నష్టం కలగకుండా బాధ్యతగా మెలగాలి

- న్యాల్‌కల్ లో గ్రామ సభ
- నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 4 (ప్రజా శంఖారావం):**



భావి తరాలకు నష్టం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. సమాజం కోసం మనం ఏమి చేస్తున్నామనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి బాధ్యతాయుతంగా మెలగాలని పిలుపునిచ్చారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో గ్రామ, వార్డు సభలకు గురువారం శ్రీకారం చుట్టారు. మోపాల్ మండలం న్యాల్కల్ గ్రామ సచివాలయ ప్రాంగణంలో సర్పంచ్ చంద్రకళ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియ, పంటల మార్పిడి, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, పచ్చదనం పెంపు, సైబర్ నేరాల నివారణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదల, తడి–పొడి చెత్త వేర్వేరు సేకరణ, ఘన వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో ఈసారి వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నందున రైతులు అనుకూల పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. పంటల మార్పిడి విధానాలను పాటిస్తూ వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాల మేరకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను వినియోగించాలని కోరారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, వారి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఇందుకోసం పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధిక మోతాదులో ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగించవద్దని, వరి కొయ్యలకు నిప్పంటించడం ద్వారా పర్యావరణానికి హాని కలిగించవద్దని రైతులకు సూచించారు. అలాంటి చర్యల వల్ల కాలుష్యం పెరిగి భావి తరాలకు నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వరి కొయ్యలను దహనం చేయడం చట్టరీత్యా నేరమని, బాధ్యులపై రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. పర్యావరణ సమతుల్యత కోసం విస్తృతంగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియ విజయవంతానికి ప్రజలు సహకరించాలని, ఇంటింటికీ వచ్చే బీఎల్‌వోలకు అవసరమైన వివరాలు అందించాలని కలెక్టర్ కోరారు. చెరువుల శిఖం భూముల ఆక్రమణలను అడ్డుకోవడంతో పాటు కబ్జాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పన్నులను సకాలంలో చెల్లిస్తూ గ్రామాభివృద్ధికి సహకరించాలని సూచించారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. శాంతియుత వాతావరణం ఉన్న ప్రాంతాలే వేగంగా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. నేరాల నియంత్రణకు, నిందితుల గుర్తింపునకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని వాటిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, యువత మత్తు పదార్థాలు, దురలవాట్లకు దూరంగా ఉండాలని హితవు పలికారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేసి చర్యలు చేపట్టాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడైనా గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్, ఏసీపీ ప్రకాశ్, డీఎల్పీవో శ్రీనివాస్, ఎంపీడీవో రాములు నాయక్, తహసీల్దార్ రేఖ, మండల వ్యవసాయ అధికారి జాదవ్ హీరా, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ను ఎదుర్కోలేక ఆరోపణలు

- అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం
- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 4 (ప్రజా శంఖారావం):**




అవినీతి, అభివృద్ధి అంశాలపై కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనే దమ్ము లేక మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ విమర్శించారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అర్బన్ నియోజకవర్గ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చిన తర్వాత మాజీ ఎమ్మెల్యే నగరానికి అప్పుడప్పుడు మాత్రమే వస్తున్నారని అన్నారు. అధికారం కోల్పోయిన అసహనంతో వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 60 స్థానాల్లో ఒక్క స్థానమే గెలుచుకున్నారని, ఆ స్థానాన్ని కూడా నిలబెట్టుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత గతంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను అధికారుల ద్వారా మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పూర్తి చేయించేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు. నగర అభివృద్ధి కోసం జరుగుతున్న చర్యలను జీర్ణించుకోలేకే బిగాల గణేష్ విమర్శలు చేస్తున్నారని అన్నారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పటికీ అర్బన్ నియోజకవర్గానికి ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా మంజూరు చేయించలేదని ఆరోపించారు. గత ప్రభుత్వంలో గృహనిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న ప్రశాంత్‌రెడ్డిని ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. టీ–హబ్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్మించినప్పటికీ ఒక్క ప్రముఖ సంస్థను కూడా తీసుకురాలేదని, ఆ విషయంపై అప్పటి మంత్రులను ఎందుకు ప్రశ్నించలేదని అన్నారు. నిజామాబాద్ అభివృద్ధి కంటే వ్యక్తిగత ఆర్థిక ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. నగరంలో 396 ఇళ్ల కేటాయింపునకు తాను మంత్రులతో చర్చించి చర్యలు తీసుకున్నానని తెలిపారు. మరో వారంలో నగర అభివృద్ధి అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పలు ప్రతిపాదనలు సమర్పించనున్నట్లు వెల్లడించారు. మినీ ట్యాంక్‌బండ్ అంశంపై కూడా అవగాహన లేకుండా ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. కాంట్రాక్టు గడువు ముగియడంతో పాత కాంట్రాక్టర్ బాధ్యతలు విరమించుకున్నారని, కొత్త కాంట్రాక్టర్ నియామకం ప్రభుత్వం, కార్పొరేషన్ పరిధిలోని అంశమని వివరించారు. గతంలో మినీ ట్యాంక్‌బండ్‌లో మొక్కల కొనుగోలు, కార్పొరేషన్ నిర్వహణలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. తాను ఏ శాఖలోనైనా ఒక్క రూపాయి అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే బహిరంగ చర్చకు సిద్ధమని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. తన హయాంలో ఒక్క గుంట భూమి కూడా కొనుగోలు చేయలేదని, అభివృద్ధి అంశాలపై ఎప్పుడైనా ప్రజల ముందుకు వచ్చి చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, బీజేపీ ఫ్లోర్ లీడర్ ప్రమోద్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ జ్యోతి, కార్పొరేటర్లు చింతకాయల రాజేందర్, మఠం పవన్, బంటు ప్రీతి ప్రవీణ్, బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్, కల్పే అర్చనా చిరంజీవి, మమత శివ, సీనియర్ నాయకులు న్యాలం రాజు, పుట్ట వీరేందర్, విజయ్, ఇల్లెందుల ప్రభాకర్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి కాంగ్రెస్‌లో వర్గపోరు

- షబ్బీర్ అలీపై ఫిర్యాదు
- గాంధీభవన్ లో క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవిని కలిసిన నేతలు

**కామారెడ్డి, జూన్ 4 (ప్రజా శంఖారావం):**



కామారెడ్డి కాంగ్రెస్‌లో నెలకొన్న వర్గ విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. మాజీ మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పార్టీ బలోపేతానికి అడ్డంకిగా మారుతున్నారని ఆరోపిస్తూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి వర్గానికి చెందిన నేతలు గాంధీభవన్‌లో రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవికి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మామిళ్ల అంజయ్య, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ ఆధ్వర్యంలో సమర్పించిన ఫిర్యాదులో పలువురు నాయకులు పాల్గొన్నారు.

### పార్టీ ఎదుగుదలకు అడ్డంకులంటూ ఆరోపణలు

ఫిర్యాదులో షబ్బీర్ అలీ, ఆయన కుటుంబ సభ్యులు కామారెడ్డి నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాలను తమ ఆధీనంలో ఉంచుకొని ఇతర నాయకులు ఎదగకుండా చేస్తున్నారని ఆరోపించారు. యువత, మహిళలు, ద్వితీయ శ్రేణి నాయకులకు అవకాశాలు కల్పించడం లేదని పేర్కొన్నారు.

### మున్సిపల్ ఎన్నికలపై అభ్యంతరాలు

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమికి షబ్బీర్ అలీ వర్గం ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమైందని ఆరోపించారు. కొన్ని వార్డుల్లో ఇండిపెండెంట్ అభ్యర్థులకు మద్దతు ఇచ్చి కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

### అధిష్టానం జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి

కామారెడ్డి కాంగ్రెస్‌లో నెలకొన్న పరిస్థితులపై పార్టీ అధిష్టానం ప్రత్యేక దృష్టి సారించాలని, నియోజకవర్గంలో సమగ్ర సర్వే నిర్వహించాలని నాయకులు కోరారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తాము కృషి చేస్తున్నప్పటికీ తమపై కక్షసాధింపు చర్యలు జరుగుతున్నాయని ఆరోపించారు.

### విచారణకు హామీ

నాయకుల ఫిర్యాదుపై స్పందించిన మల్లు రవి, కామారెడ్డిలో చోటుచేసుకున్న పరిణామాలపై విచారణ జరిపిస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. పార్టీ బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు.



# మచ్చ తుడిచేద్దాం.. గులాబీ జెండా ఎగరవేద్దాం

## మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్




**కామారెడ్డి, జూన్ 4 (ప్రజా శంఖారావం):**

కామారెడ్డి అభివృద్ధి కోసం పోటీ చేసిన మాజీ సీఎం కె. చంద్రశేఖర్ రావు ఓటమి నియోజకవర్గానికి తీరని మచ్చ అని, ఆ మచ్చను తొలగించుకునేలా పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పిలుపునిచ్చారు. గురువారం కామారెడ్డిలో జరిగిన బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 30 నెలలుగా ప్రజలను మోసం చేస్తోందని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో మంజూరైన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ తమ ఘనతగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కామారెడ్డిలో మళ్లీ గులాబీ జెండా ఎగురవేసి కేసీఆర్‌ను తిరిగి సీఎం చేసేలా కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన పూర్తిగా విఫలమైందన్నారు. సీఎం అనుముల రేవంత్ రెడ్డి రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని, విద్యుత్, ధాన్యం కొనుగోలు, యూరియా సరఫరాలో సమస్యలు పెరిగాయని విమర్శించారు. రైతు డిస్కంలు, భూముల వ్యవహారాలు, వివిధ శాఖల్లో అవినీతి జరిగిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు తగిన సహకారం అందించడం లేదని, ఆర్ఆర్ఆర్ అంశంపై కేంద్ర మంత్రులు స్పందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, హన్మంత్ షిండే, తదితర నాయకులు పాల్గొన్నారు.

## బ్రిడ్జి, రహదారి మరమ్మతులు చేపట్టాలి



**భీమ్‌గల్, జూన్ 4 (ప్రజా శంఖారావం):**

భీమ్‌గల్ నుంచి బడా భీమ్‌గల్‌కు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి, వంతెన మరమ్మతులు వెంటనే చేపట్టాలని కోరుతూ బీజేపీ పట్టణ, మండల శాఖల నాయకులు గురువారం తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గత ఏడాది వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు భీమ్‌గల్–బడా భీమ్‌గల్ బీటీ రహదారి దెబ్బతి నడంతో పాటు వంతెన కూడా తీవ్రంగా దెబ్బతిన్నదని నాయకులు తెలిపారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే రహదారి, వంతెనకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యోగేశ్వర్ నర్సయ్య, పట్టణ అధ్యక్షుడు కనికరం మధు మాట్లాడుతూ దెబ్బతిన్న రహదారులు, వంతెనలకు నామమాత్రపు మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. రహదారి ప్రమాదాలు తరచూ జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. మండల అధ్యక్షుడు ఆరే రవీందర్ మాట్లాడుతూ గత వర్షాకాలంలో జరిగిన నష్టం తీవ్రంగా ఉందన్నారు. రహదారి పూర్తిగా ధ్వంసం కావడంతో బడా భీమ్‌గల్, చెంగల్, సికింద్రాబాద్, గోనుగొప్పుల తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. వంతెన దెబ్బతినడంతో రెండు నెలల పాటు రాకపోకలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. భీమ్‌గల్ నుంచి ఆర్మూర్‌కు ప్రధాన మార్గంగా ఉన్న ఈ రహదారి దెబ్బతిన దంతో అనేక గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారని అన్నారు. పది నెలలు గడిచినా శాశ్వత మరమ్మతులపై ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని విమర్శించిన ఆయన, వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేయకపోతే బాల్కొండ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు తోట గంగాధర్, పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షుడు నీలం గంగాధర్, మండల ఉపాధ్యక్షులు ఈర్ల మహేందర్, పార్థసారథి, జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి చిట్టి గౌడ్, తక్కూరి అంజయ్య, కొట్టాల మోహన్, డాక్టర్ నవీన్, కొట్టాల అశోక్, రజినీకాంత్, కాట్లే లింగం, ప్రశాంత్, హరిప్రసాద్, ఉప్పల నవీన్, యోగిని శ్రీనివాస్, పుండరీకం తదితరులు పాల్గొన్నారు.

# గడ్డం చంద్రశేఖర్ రెడ్డికి టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసు

**కామారెడ్డి, జూన్ 4 (ప్రజా శంఖారావం):**

కామారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల నుంచి అందిన ఫిర్యాదుల నేపథ్యంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) క్రమశిక్షణా చర్యల కమిటీ (డీఏసీ) కీలక నిర్ణయం తీసుకుంది. పీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డికి షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఇటీవల కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు డీఏసీ చైర్మన్ డాక్టర్ మల్లు రవి, ఉపాధ్యక్షుడు శ్యాం మోహన్‌లను కలిసి గడ్డం చంద్రశేఖర్ రెడ్డిపై ఫిర్యాదు చేస్తూ వినతిపత్రం సమర్పించారు. అందిన ఫిర్యాదులను నిశితంగా పరిశీలించిన క్రమశిక్షణ కమిటీ, వివరణ కోరుతూ షోకాజ్ నోటీసు జారీ చేసింది. నోటీసులో పేర్కొన్న అంశాలపై నిర్ణీత గడువులోగా లిఖితపూర్వక వివరణ సమర్పించాలని ఆదేశించింది. ఈ సందర్భంగా కామారెడ్డి కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, పార్టీ క్రమశిక్షణను పరిరక్షించడంలో టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ తీసుకున్న చర్యను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, విలువలు, సంస్థాగత వ్యవస్థను బలోపేతం చేయడానికి క్రమశిక్షణ అత్యంత అవసరమని పేర్కొన్నారు. గడ్డం చంద్రశేఖర్ రెడ్డిపై చేసిన ఆరోపణలకు తగిన ఆధారాలు ఉన్నందున ఆయనను వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా స్పందించి చర్యలు తీసుకున్న డీఏసీ చైర్మన్ డాక్టర్ మల్లు రవి, ఉపాధ్యక్షుడు శ్యాం మోహన్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లు జోక్యం చేసుకుని గడ్డం చంద్రశేఖర్ రెడ్డిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. డీఏసీ కమిటీ చర్యలను స్వాగతిస్తూ కామారెడ్డి నియోజకవర్గంలోని ఏడు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ మండల అధ్యక్షులు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, ఎస్సీ సెల్, ఎస్టీ సెల్, యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తమ కృతజ్ఞతలు తెలిపారు



## విద్యా పరిరక్షణ కమిటీ ధర్నా

**కామారెడ్డి, జూన్ 4 (ప్రజా శంఖారావం):**

అందరికీ నాణ్యమైన, సమానమైన విద్యను అందించాలని డిమాండ్ చేస్తూ నేడు హైదరాబాద్‌లో నిర్వహించే ర్యాలీ, ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర నాయకుడు, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. టీపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యా రంగానికి బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించడం, అన్ని ఖాళీ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయడం, మౌలిక సదుపాయాలు కల్పించడం, ప్రైవేట్ విద్యా వ్యవస్థపై నియంత్రణ విధించడం, తెలంగాణలో ఎన్‌ఈపీ-2020 అమలు చేయకపోవడం వంటి డిమాండ్లతో ర్యాలీ, ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కవాడిగూడలోని ఏసీటీసీ నుంచి ఇందిరాపార్కు వరకు ర్యాలీ, అనంతరం ధర్నా జరుగు తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వి.ఎస్. ప్రసాద్, ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్, ప్రొఫెసర్ హరగోపాల్‌తో పాటు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించనున్నారు. సమావేశం లో సీహెచ్ లింగం, కె. శ్రీనివాస్, కె. వేణుగోపాల్, విజయ రామరాజు, నరేందర్, శ్రీనివాస్ తదితర విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## గ్రంథాలయ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలి



**భీమ్‌గల్, జూన్ 4 (ప్రజా శంఖారావం):**

యువత గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని పలువురు ఆకాంక్షించారు. భీమ్‌గల్ మండలం చేంగల్ గ్రామంలో నిజామాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన గ్రామీణ గ్రంథాలయాన్ని గురువారం జిల్లా గ్రంథాలయ జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, సర్పంచ్ దుమల మమత రాజు, ఉపసర్పంచ్ మోహన్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి వినయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువత పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. వివిధ ఉద్యోగ, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. సోషల్ మీడియాకు అతు క్కుపోకుండా యువత గ్రంథాలయాల్లోని పుస్తకాలను వినియోగించుకోవాలని హితవు పలికారు. గ్రంథాలయంలో ఐఏఎస్, ఐపీఎస్‌తో పాటు వివిధ పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు ఆర్మూర్ రవి, బాబాగౌడ్, బాయి నరేష్, వార్డు సభ్యులు, వీడీసీ ప్రతినిధులు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ కుటుంబ ప్రయోజన పథకం చెక్కుల పంపిణీ



**భీంగల్, జూన్ 4 (ప్రజా శంఖారావం):**

జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్‌బీఎస్) ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ ఉత్తర్వులను భీంగల్ మండలంలోని పురానిపేట గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.20 వేల చొప్పున మంజూరైన ఉత్తర్వులను అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేసేందుకు అధికారులు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పురానిపేట సర్పంచ్ సుమ, టైపిస్ట్ చంద్రశేఖర్, పీఎస్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రజలు భాగస్వాములు కావాలి



**ఇందల్వాయి, జూన్ 4 (ప్రజా శంఖారావం):**

ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఫారెస్ట్ రేంజ్ అధికారి రవి మోహన్ బట్ నాయకత్వంలో చేపట్టిన ర్యాలీ పర్యావరణ పరిరక్షణ, అడవుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేలా సాగింది. మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్ల గుండా నిర్వహించిన ఈ ర్యాలీలో అటవీ శాఖ సిబ్బంది, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణకు సంబంధించిన సందేశాలను ప్రజలకు చేరవేశారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ అధికారి రవి మోహన్ బట్ మాట్లాడుతూ ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో అడవుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారులు సురేందర్, ప్రభాకర్, భాస్కర్, మానస, బీట్ అధికారులు రాకేష్, ప్రవీణ్, వంశీరాజ్, అటవీ శాఖ సిబ్బంది, స్థానిక యువత పాల్గొన్నారు.

## సీసీ, డ్రైనేజీ పనులకు శ్రీకారం



**ఇందల్వాయి, జూన్ 4 (ప్రజా శంఖారావం):**

గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్య మెరుగుదల లక్ష్యంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా పెద్ద హనుమాన్ మందిరం నుంచి జగ్గయ్యకాల వరకు నిర్మించనున్న సీసీ డ్రైనేజీ పనులను గురువారం ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ లోకని గంగామణి గంగారం, ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పనులు నిర్వహించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, వీడీసీ అధ్యక్షుడు కాజపురం మహేందర్, మాజీ ఎంపీటీసీ మరంపల్లి సుధాకర్, ఆరవ వార్డు సభ్యుడు ఈశ్వర్, హనుమంత్, శ్రీకాంత్, కాసుల సత్యనారాయణ, కాంట్రాక్టర్ పి.ఎన్. గంగాధర్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## యువకుడు అదృశ్యం

**కామారెడ్డి/దోమకొండ, జూన్ 4 (ప్రజా శంఖారావం):**

కామారెడ్డి జిల్లా దోమకొండ గ్రామానికి చెందిన బిల్ల మనోజ్ కుమార్ (20) అదృశ్యమైన ఘటన స్థానికంగా ఆందోళన కలిగించింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, మనోజ్ కుమార్ ఈ నెల 3వ తేదీ ఉదయం 8 గంటల సమయంలో దోమకొండలోని తన ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో, అతని తండ్రి బిల్ల మహేష్ గురువారం దోమకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు దోమకొండ ఎస్సై ప్రభాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మనోజ్ కుమార్ ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

# వార్డు సభలను విజయవంతం చేయాలి

**కామారెడ్డి, జూన్ 4 (ప్రజా శంఖారావం):**

తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న వార్డు సభల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వార్డు సభలు స్థానిక సమస్యల పరిష్కారం, వార్డుల సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని ఆమె తెలిపారు. పట్టణాన్ని స్వచ్ఛ కామారెడ్డిగా తీర్చిదిద్దేందుకు తడి-పొడి చెత్తను ఇంటి వద్దనే వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వార్డు సభల్లో రోడ్లు, మురుగుకాలువలు, వీధి దీపాలు, పారిశుధ్యం తదితర సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేయవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొత్తపల్లి లలిత చిట్టిబాబు, గ్యార అఖిల, నిట్టు గంగాధర్, మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, ఆర్ఓ గోపాల్ రెడ్డి, ఆర్ఐ రమేష్, సీనియర్ నాయకుడు గ్యార సాయిలు, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

**34 వ వార్డులో సీసీ రోడ్డు పనులు**

మున్సిపాలిటీ 34వ వార్డులో సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ప్రత్యేక చొరవతో పార్టీలకు అతీతంగా నిధులు మంజూరవుతున్నాయని, ఆయన మార్గదర్శకత్వంలో కామారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ఆకుల సుజిత భరత్, పబ్లిక్ హెల్త్ ఏఈ నీర్భాయ్, ఆకుల గోపి, ఎస్. రాములు (రిటైర్డ్ ఎంఈఓ), అర్జున్ రావు, గోపాల్ రెడ్డి, వార్డు ప్రజలు పాల్గొన్నారు.




# క్రమశిక్షణ, సరైన మార్గదర్శకత్వమే విజయానికి పునాది

- **నిజామాబాద్‌లో రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్ ప్రారంభం**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 4 (ప్రజా శంఖారావం):**

క్రమశిక్షణ, సరైన మార్గదర్శకత్వం విజయానికి మూలమని మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. ఐఐటీ–జేఈఈ, నీట్ శిక్షణలో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన రెసోనెన్స్ విద్యాసంస్థలు గురువారం నిజామాబాద్‌లోని హోటల్ వంశీ ఇంటర్నేషనల్‌లో 'రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్'ను ప్రారంభించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మీనారాయణ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే బలమైన విద్యా పునాదిని నిర్మించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిజామాబాద్‌లో ఫౌండేషన్ కోచింగ్‌ను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రెసోనెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు నర్రా మాట్లాడుతూ అనుభవజ్ఞులైన అధ్యాపకులు, క్రమబద్ధమైన బోధనా విధానాలు, నిరంతర విద్యా పర్యవేక్షణతో ఫలితాల ఆధారిత విద్యను అందించేందుకు సంస్థ కట్టుబడి ఉందన్నారు. ఫౌండేషన్ సెంటర్ ద్వారా విద్యార్థులు ప్రాథమిక అంశాలపై పట్టు సాధించడంతో పాటు ఐఐటీ–జేఈఈ, నీట్, ఒలింపియాడ్స్ వంటి పోటీ పరీక్షలకు ఆత్మవిశ్వాసంతో సిద్ధమయ్యే అవకాశం కలుగుతుందని తెలిపారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో విద్యార్థులు ప్రారంభ దశలోనే ప్రిపరేషన్ ప్రారంభించడం, భావనాత్మక అవగాహన పెంపొందించుకోవడం, కెరీర్ లక్ష్యాలకు అనుగుణంగా విద్యా ప్రణాళిక రూపొందించుకోవడం వంటి అంశాలపై వివరించారు. 2001లో రాజస్థాన్‌లోని కోటాలో ఐఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థి ఆర్కే వర్మ స్థాపించిన రెసోనెన్స్ విద్యాసంస్థలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా విస్తరించాయి. 87 నగరాల్లో 150కిపైగా కేంద్రాల ద్వారా లక్షలాది మంది విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 2018లో ప్రారంభమైన సంస్థ ప్రస్తుతం 50కుపైగా క్యాంపస్‌లతో కార్యకలాపాలు నిర్వహిస్తూ ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఎయిమ్స్‌తో పాటు పలు అగ్రశ్రేణి విద్యాసంస్థల్లో విద్యార్థుల ప్రవేశాలకు మార్గం సుగమం చేస్తోందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్ అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# ఆరు గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు

**భీంగల్, జూన్ 4 (ప్రజా శంఖారావం):**

తెలంగాణ ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భీంగల్ మండలంలోని బాబానగర్, బాబాపూర్, బెజ్జోరా, సంతోష్‌నగర్ తాండా, కొత్తతాండా, బాచన్‌పల్లి గ్రామాల్లో గురువారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. బాచన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన ఏడు ప్రధాన అంశాలపై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాల సన్నద్ధతలో భాగంగా ప్రతి కుటుంబం తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామపంచాయతీలు పిచ్చి మొక్కల తొలగింపు, మురుగు కాలువల శుభ్రత, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, యాంటీ లార్వా స్ప్రే నిర్వహణ వంటి చర్యల ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. ప్రతి గ్రామంలో సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి గ్రామపంచాయతీ ట్రాక్టర్‌కు అందించాలని, రోడ్లపై లేదా మురుగు కాలువల్లో చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన పెంచాలని అన్నారు. జల సంరక్షణలో భాగంగా ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, గ్రామాల్లో సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సూచించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మొక్కల పెంపకానికి అనువైన ప్రదేశాలను గుర్తించి విస్తృతంగా మొక్కలు నాటాలని కోరారు. ప్రతి కుటుంబం కనీసం ఐదు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో జీపీఓలు, బీఎల్‌వోలు నిర్వహిస్తున్న ఎన్యుమరేషన్ ప్రక్రియకు సహకరించి అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పీఎస్ సంజయ్, మహిళా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



## ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా వార్డు సభలు

**భీంగల్, జూన్ 4 (ప్రజా శంఖారావం):**

ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా భీంగల్ పురపాలక సంఘం పరిధిలోని 2, 10 వార్డుల్లో గురువారం వార్డు సభలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి అధ్యక్షతన నిర్వహించిన ఈ సభల్లో ప్రజలకు పలు అభివృద్ధి, సంక్షేమ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికకు సంబంధించిన అంశాలను ప్రజలకు వివరించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సురక్షిత తాగునీటి వినియోగం, తడి–పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కోరారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి ప్రణాళికలు, అమలు చేస్తున్న కార్యక్రమాల వివరాలను సభలో వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ సంటి లత నర్సయ్య, కౌన్సిలర్ పరస కుశలత అనంతరావు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా శంఖారావం
PRAJA SHANKARAVAM
శుక్రవారం
జూన్ 5, 2026
epaper.prajashankaravam.com
www.prajashankaravam.com

## భక్తిశ్రద్ధలతో కట్ట మైసమ్మ పండుగ



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, జూన్ 4 (ప్రజా శంఖారావం):**

నిజామాబాద్ రూరల్ మండలంలోని పెద్ద వాల్గోట్ గ్రామంలో ఉపాధి హామీ పనుల వద్ద కట్ట మైసమ్మ పండుగను ఉపాధి కూలీలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వనిత నర్సింగ్ బోనాలు ఎత్తుకొని కట్ట మైసమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాము, కార్యదర్శి రాజు, వార్డు సభ్యులు గోపి, రఘు, వీడీసీ సభ్యుడు సాగర్ రెడ్డి, గ్రామ నాయకులు, ఉపాధి కూలీలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందల్వాయి పెద్ద చెరువు స్థలంపై సర్వే ప్రారంభం



**ఇందల్వాయి, జూన్ 4 (ప్రజా శంఖారావం):**

మండల కేంద్రంలోని పెద్ద చెరువు ఆక్రమణకు గురైన స్థలాన్ని గుర్తించేందుకు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు గురువారం సంయుక్తంగా సర్వే ప్రారంభించారు. చెరువు భూములు ఆక్రమణకు గురవుతున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం, విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులతో కలిసి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి చెరువు సరిహద్దులను పరిశీలించారు. సర్వే నంబర్ల ఆధారంగా కొలతలు చేపట్టి ఆక్రమణలకు గురైన భూములను గుర్తించే ప్రక్రియను ప్రారంభించారు. గ్రామ ప్రజల జీవనాధారంగా ఉన్న చెరువులను, ప్రజా ఆస్తులను ఆక్రమణల నుంచి పరిరక్షించేందుకు నిష్పక్షపాతంగా సర్వే పూర్తి చేసి, అక్రమ ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ లోకని గంగామణి గంగారం, ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, వీడీసీ అధ్యక్షుడు కాజాపురం మహేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, శివ, కాసుల సత్యనారాయణ, సాయిలు, బాల గంగారం పాల్గొన్నారు.

## సిరికొండ పాఠశాలకు ప్రొజెక్టర్ల విరాళం



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, జూన్ 4 (ప్రజా శంఖారావం):**

సిరికొండ మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థుల విద్యాభివృద్ధికి గ్రామపంచాయతీ ముందడుగు వేసింది. పంచాయతీ తరఫున సర్పంచ్ సాయి చరణ్, ఉప సర్పంచ్ శోభన్ రెండు ఆధునిక ప్రొజెక్టర్లను పాఠశాలకు విరాళంగా అందజేశారు. ప్రస్తుతం విద్యారంగంలో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో ఈ ప్రొజెక్టర్లు విద్యార్థులకు డిజిటల్ విధానంలో పాఠాలు బోధించేందుకు ఎంతో ఉపయోగపడనున్నాయి. చిత్రాలు, వీడియోలు, డిజిటల్ పాఠ్యాంశాల ద్వారా బోధన మరింత సులభంగా, ఆసక్తికరంగా మారుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా ఆధునిక విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ సహాయం అందించామని సర్పంచ్ సాయి చరణ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామపంచాయతీ పాలకవర్గానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళ, ఇద్దరు చిన్నారులు అదృశ్యం





**భీంగల్, జూన్ 4 (ప్రజా శంఖారావం):**

ముచ్కూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ తన ఇద్దరు కుమార్తెలతో కలిసి అదృశ్యమైన ఘటన ఆందోళన కలిగిస్తోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరగుల సుహాని అలియాస్ గాయత్రి (29) జూన్ 3న ఉదయం లక్కోర గ్రామంలోని తన ఇంటికి వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి ముచ్కూర్ నుంచి బయలుదేరింది. అనంతరం ఆమె ఆచూకీ లభించలేదు. మహిళ మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో కుటుంబ సభ్యులు బంధువులు, ఇతర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఎలాంటి సమాచారం లభించలేదు. దీంతో ఆమె సోదరుడు రెడ్డి దినేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీంగల్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గాయత్రితో పాటు ఆమె కుమార్తెలు సుధీక్షా దేవి (7), ఆద్య (4) కూడా కనిపించడం లేదు. అదృశ్యమైన సమయంలో గాయత్రి ఎరుపు రంగు దుస్తులు, పెద్ద కుమార్తె నీలం రంగు దుస్తులు, చిన్న కుమార్తె తెలుపు రంగు దుస్తులు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మహిళ, చిన్నారుల ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్ లేదా భీంగల్ పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

# రక్తదాతలు కాదు ప్రాణదాతలు

- టీఎన్జీవోస్ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం
- ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డితో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే భూపతి రెడ్డి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 4 (ప్రజా శంఖారావం):**




ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపు రక్తదాతలను అభినందించిన ముఖ్య అతిథులు తెలంగాణ రాష్ట్రఅవతరణ దినోత్సవం సందర్భంగా.. ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా టీఎన్జీవోస్ నిజాంబాద్ జిల్లా పక్షాన ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టిఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్ అధ్యక్షతన వహించారు. గురువారం IDOC కార్యాలయ మీటింగ్ హాల్ నందు, నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రభుత్వ ముఖ్య సలహాదారులు, పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. రేకులపల్లి భూపతి రెడ్డితో కలిసి రిబ్బన్ కట్ చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఇట్టి బృహత్తర కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన టిఎన్జీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులను అభినందించి, ఎప్పటికప్పుడు ఉద్యోగుల సమస్యలపై స్పందిస్తూనే... సమాజ సేవలో మేము సైతం అంటూ... తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జరిగిన నాటినుండి ప్రతి సంవత్సరం టీఎన్జీవో ఆధ్వర్యంలో రక్తదానం శిబిరాలను ఏర్పాటు చేసి ప్రభుత్వానికి మరియు స్వచ్ఛంద సంస్థలకు ముఖ్యంగా జిల్లాలో గల తలసేమియా బాధితుల సేవార్థం ఇట్టి రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని, కొనియాడుతూ...ఇట్టి రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచిన ప్రతి ఒక్కరిని అభినందించి, హృదయపూర్వక ధన్యవాదములు తెలిపి,అత్యవసర సమయాల్లో ఒక ప్రాణాన్ని కాపాడడానికి రక్తం ఆవశ్యకతను ముఖ్య అతిథులు వివరించారు ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేసి దాతలు రక్తదాతలు మాత్రమే కాదని ప్రాణదాతలు అని అభివర్ణించారు. ఉద్యోగుల సమస్యలపై చేపడుతున్న పోరాటాలను అభినందించారు. ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో ప్రజలకు చేరవేయడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, రాష్ట్ర గీతా పారిశ్రామిక కార్పొరేషన్ చైర్మన్ శేఖర్ గౌడ్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హమ్దాన్, నిజాంబాద్ జిల్లా వైద్యాధికారిని డాక్టర్ రాజశ్రీ గారు, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ గారు, రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, జిల్లా సహాధ్యక్షులు పెద్దోళ్ల నాగరాజు, జిల్లా కోశాధికారి నిరంజన్ గౌడ్, ఉపాధ్యక్షులు సంజీవయ్య, సునీత, జాఫర్ హుస్సేన్, మాణిక్యం, వివిధ యూనిట్ శాఖల అధ్యక్ష కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, మారుతి, శ్రీనివాస్ ,శశికాంత్ రెడ్డి, విశాల్, ప్రవీణ్ రాజ్, సాయి కృష్ణ ,సృజన్ కుమార్, సాయికుమార్, కార్తీక్, నగేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు పద్మ, ప్రకాష్, గీతారెడ్డి ,శ్రీవేణి, సునీల్, స్వామి ,రాజేశ్వర్ అధిక సంఖ్యలో ఉద్యోగులు హాజరై రక్తదాన శిబిరంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# జిల్లా రుణ ప్రణాళిక ఆవిష్కరణ

**కామారెడ్డి, జూన్ 4 (ప్రజా శంఖారావం):**




జిల్లా 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జిల్లా రుణ ప్రణాళిక (డీసీపీ)ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆవిష్కరించారు. ఐడీఓసీ మినీ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్షా కమిటీ (డీఎల్ఆర్సీ) సమావేశంలో నాబార్డ్ డీడీఎం ప్రవీణ్ కుమార్, ఆర్బీఐ లీడ్ బ్యాంక్ అధికారి శ్రీనివాస్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జె. చంద్రశేఖర్, బ్యాంకర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. మొత్తం రూ.9,132.56 కోట్ల రుణ లక్ష్యంతో రూపొందించిన ప్రణాళికలో వ్యవసాయ రంగానికి రూ.6,226.59 కోట్లు, పంట రుణాలకు రూ.3,806.71 కోట్లు, వ్యవసాయ టర్మ్ లోన్లకు రూ.1,798.84 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగానికి రూ.1,282 కోట్లు కేటాయించారు. వ్యవసాయం, ఎంఎస్ఎంఈలు, స్వయం సహాయక సంఘాలకు రుణాల పంపిణీని విస్తరించి, అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ బ్యాంకర్లకు సూచించారు.

**10 శాతం ప్రవేశాల పెంపే లక్ష్యం**

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు (కేజీబీవీలు), మోడల్ స్కూళ్లు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల నమోదును గత ఏడాదితో పోలిస్తే కనీసం 10 శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు, మండల విద్యాధికారులు (ఎంఈఓలు), కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లతో ప్రవేశాల పురోగతిని సమీక్షించారు. "ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రతి గ్రామం, వార్డులో ప్రత్యేక ప్రచారం నిర్వహించి ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉన్న సౌకర్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. డ్రాప్‌అవుట్ విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించి, ప్రవేశాల లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఎన్వీ గిరి, విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు, ఎంఈఓలు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## ఇందల్వాయి ఎస్‌హెచ్‌ఓగా భూక్య సుమలత

**ఇందల్వాయి, జూన్ 4 (ప్రజా శంఖారావం):**



ఇందల్వాయి పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా భూక్య సుమలత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇందల్వాయి పోలీస్ స్టేషన్‌కు తొలి మహిళా ఎస్‌హెచ్‌ఓగా ఆమె నియమితులయ్యారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నిజామాబాద్ వీఆర్ నుంచి ఇందల్వాయికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనంతరం ఆమె స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా భూక్య సుమలత మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి సమస్యలను నేరుగా తెలియజేయాలని కోరారు.

## కలెక్టర్‌ను కలిసిన కొత్త అధికారులు



**కామారెడ్డి, జూన్ 4 (ప్రజా శంఖారావం):**

జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన సంతోష్ కుమార్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన శంకర్ నారాయణ గురువారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూల మొక్కను అందజేశారు. అదే విధంగా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణిగా ఎఫ్ఏసీగా బాధ్యతలు స్వీకరించిన ఐ. ప్రసన్న కూడా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఇదిలా ఉండగా, బదిలీపై వెళుతున్న మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి ప్రమీలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె అందించిన సేవలను కలెక్టర్ అభినందించారు.

# తహసీల్దార్ బాలలక్ష్మిని సత్కరించిన పాత్రికేయులు

**చేగుంట, జూన్ 4 (ప్రజా శంఖారావం):**



మెదక్ జిల్లా, చేగుంట మండల నూతన తహసిల్దార్ (ఎమ్మార్వో) గా బాధ్యతలు స్వీకరించిన బాలలక్ష్మి ని చేగుంట మండల రిపోర్టర్లు (పాత్రికేయులు) గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో ఆమెను కలిసి నూతన విధుల్లో చేరినందుకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం విలేకరులందరూ కలిసి నూతన తహసిల్దార్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. తహసిల్దార్ బాలలక్ష్మి దీనికంటే ముందు వెల్దుర్తి మండలంలో ఎమ్మార్వోగా సుదీర్ఘ సేవలు అందించి, బదిలీపై చేగుంట మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేగుంట మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శకమైన సేవలు అందిస్తానని స్పష్టం చేశారు. మండల ప్రగతిలో మీడియా పాత్ర కూడా కీలకమని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో చేగుంట మండల రిపోర్టర్లు అన్నం మహేష్, సూర్య ప్రకాష్, మొహమ్మద్ ముజామిల్, సతీష్, నాగార్జున, శ్రావణ్ కుమార్, చిక్కుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## చేగుంట మండలంలో ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక గ్రామసభలు ప్రారంభం

**చేగుంట, జూన్ 4 (ప్రజా శంఖారావం):**

మెదక్ జిల్లా, చేగుంట మండలం, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా చేగుంట మండలంలోని మొత్తం 25 గ్రామపంచాయతీలకు గాను, మొదటి విడత కింద గురువారం 6 గ్రామపంచాయతీలలో ప్రత్యేక గ్రామసభలను విజయవంతంగా నిర్వహించారు. ఈ సభలకు మండల, గ్రామ స్థాయి అధికారులు, సర్పంచులు, పాలకవర్గ సభ్యులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామసభల్లో ప్రధానంగా.. వర్షాకాలం సన్నద్ధత, సురక్షిత తాగునీరు, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ – మన సంరక్షణ, మొక్కల పెంపకం – వన మహోత్సవం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, వరద నిర్వహణ–భద్రత అనే ఏడు రకాల కీలక అంశాలపై ప్రజలతో ముమ్మరంగా చర్చించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ఎదురయ్యే ప్రత్యేక అవసరాలు, స్థానిక సమస్యల నిమిత్తం ఆయా అంశాలపై గ్రామసభలలో ఏకగ్రీవంగా తీర్మానాలు చేయడం జరిగింది.



## డాక్టర్ అర్హతలు లేకుండానే వైద్యం..



**ఆర్మూర్ జూన్ 4(ప్రజా శంఖారావం):**

ఆర్మూర్ లోని కమలా నెహ్రూ కాలనీలో నిర్వహిస్తున్న ప్రియాంక, భారతి క్లినిక్‌లపై జిల్లా వైద్యాధికారి డా. రాజశ్రీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి గురువారం రోజు సీజ్ చేశారు. సంబంధిత నిర్వాహకులు అర్హత కలిగిన వైద్య సర్టిఫికెట్లు లేకుండానే వైద్యం అందిస్తున్నట్లు గుర్తించిన అధికారులు చర్యలు చేపట్టారు.గతంలో కూడా నిర్వాహకులపై కేసు నమోదైనప్పటికీ తిరిగి క్లినిక్‌లు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు అర్హత కలిగిన వైద్యుల వద్ద మాత్రమే చికిత్స పొందాలని డీఎంహెచ్ఓ సూచించారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ డిఎంఎచ్ఓ రవీందర్, హెల్త్ సూపరింటెండెంట్ చంద్ర శేఖర్, సాయి కుమార్ పాల్గొన్నారు.



## ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక గ్రామసభలు విజయవంతం

**నిజామాబాద్ రూరల్ సిరికొండ, జూన్ 4 (ప్రజా శంఖారావం):**

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక గ్రామసభలు విజయవంతంగా కొనసాగుతున్నాయని ఎంపీడీవో మనోహర్ రెడ్డి తెలిపారు. జూన్ 4, 6, 8, 10 తేదీలలో నిర్వహిస్తున్న గ్రామసభల్లో తాగునీటి సరఫరా, వర్షాకాల సన్నద్ధత, చెత్త నిర్వహణ, జల సంరక్షణ, మొక్కల పెంపకం, ఓటర్ల జాబితా సవరణ, విపత్తు నిర్వహణ వంటి కీలక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో చెత్తను నాలుగు రకాలుగా వర్గీకరించి సేకరించడం, ఇంటి వద్దే కంపోస్ట్ తయారీ చేపట్టడం వల్ల గ్రామపంచాయతీలకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని అధికారులు వివరించారు. వర్షాకాలంలో భూగర్భ జలాల పెంపు కోసం ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని, వినియోగంలో లేని బోర్లను రీఛార్జ్ నిర్మాణాలకు ఉపయోగించాలని సూచించారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్లాంటేషన్ మహోత్సవం కింద విస్తృతంగా మొక్కలు నాటడం, ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. వర్షపాతం సమతుల్యంగా ఉండేందుకు, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి గ్రామంలో మొక్కల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమం ద్వారా ఓటర్ల జాబితా సమగ్ర సవరణపై కూడా ప్రజలకు వివరించినట్లు తెలిపారు. వర్షాకాలంలో వరదలు వంటి విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన పంచాయతీ కార్యదర్శి, జీపీఓ, విద్యుత్ శాఖ అధికారుల వివరాలను ప్రజలకు తెలియజేసినట్లు పేర్కొన్నారు. చీమనుపల్లి, గడ్డమీది తండా, ముషీర్‌నగర్, నర్సింగ్‌పల్లి, రామడుగు, తుంపల్లి, పందిమడుగు, సర్పల్లి తండా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలు వివిధ శాఖల సమన్వయంతో విజయవంతంగా జరిగాయని ఎంపీడీవో తెలిపారు.

# శింబుతో సినిమా చూడాలనుంది: మీనాక్షి

టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న కథానాయిక మీనాక్షి చౌదరి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. తెలుగు, తమిళ భాషల్లో వరుస అవకాశాలు అందుకుంటున్న ఈ అందాల నటి, ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తమిళ స్టార్ హీరో శింబుపై తన అభిమానాన్ని వ్యక్తం చేశారు. ఇంటర్వ్యూలో భాగంగా "సినీ పరిశ్రమకు చెందిన ఏ హీరోతోనైనా సినిమా చూడడానికి వెళ్లే అవకాశం వస్తే ఎవరిని ఎంచుకుంటారు?" అనే ప్రశ్నకు మీనాక్షి ఏమాత్రం ఆలోచించకుండా శింబు పేరును చెప్పారు. "సినిమా చూడటానికి వెళ్లాలంటే నేను ఖచ్చితంగా శింబు గారినే ఎంచుకుంటాను" అంటూ సమాధానమిచ్చారు. ఆయన నటన, తెరపై కనిపించే తీరు తనకు ఎంతో ఇష్టమని పేర్కొన్నారు. మీనాక్షి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం అభిమానుల మధ్య చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా శింబు అభిమానులు ఈ వ్యాఖ్యలను ఆనందంగా స్వాగతిస్తూ, వీరిద్దరి కలయికలో ఒక చిత్రం వస్తే చూడాలని ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, తమిళ సినీ వర్గాల్లో వినిపిస్తున్న కథనాల ప్రకారం శింబు కథానాయకుడిగా తెరకెక్కుతున్న ఓ భారీ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయికగా నటించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వార్తల మధ్య ఆమె చేసిన వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రస్తుతం మీనాక్షి చౌదరి తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో బిజీగా గడుపుతున్నారు. వరుస విజయాలతో ఆమెకు 'అదృష్ట కథానాయిక' అనే పేరు కూడా వచ్చింది. తెలుగులో పలు ప్రతిష్టాత్మక చిత్రాల్లో నటిస్తూనే, తమిళంలోనూ వరుస అవకాశాలను అందుకుంటున్నారు. హర్యానాకు చెందిన మీనాక్షి చౌదరి వృత్తిరీత్యా దంత వైద్యురాలు. విద్యాభ్యాసం పూర్తయ్యాక మోడలింగ్ రంగంలో అడుగుపెట్టి జాతీయ స్థాయి అందాల పోటీల్లో గుర్తింపు పొందారు. అనంతరం సినీ రంగంలోకి ప్రవేశించి తన అందం, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ అగ్ర కథానాయికల జాబితాలో చోటు సంపాదించారు. ప్రస్తుతం ఆమె నటిస్తున్న కొత్త చిత్రాలపై కూడా సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. వరుస విజయాలతో ముందుకు సాగుతున్న మీనాక్షి చౌదరి పేరు మరోసారి వార్తల్లో నిలవడానికి శింబుపై చేసిన ఈ వ్యాఖ్యలే కారణమయ్యాయి.





# బిస్కెట్ ప్రకటనతో మారిన రమ్యకృష్ణ జీవితం

సినీ పరిశ్రమలో ఎంతోమంది కథానాయికలు కొద్ది సినిమాలకే పరిమితమవుతుంటే, మరికొందరు మాత్రం దశాబ్దాల పాటు తమ ప్రస్థానాన్ని విజయవంతంగా కొనసాగిస్తూ ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకుంటారు. అలాంటి అరుదైన నటీమణుల్లో రమ్యకృష్ణ ఒకరు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో 200కు పైగా చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. రమ్యకృష్ణ సినీ ప్రస్థానం వెనుక ఒక ఆసక్తికరమైన కథ ఉంది. ఆమెను చిత్రసీమకు పరిచయం చేయడంలో ఒక బిస్కెట్ ప్రకటన కీలక పాత్ర పోషించిందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అప్పట్లో తమిళంలో తెరకెక్కుతున్న 'వెళ్లై మనసు' చిత్రానికి ప్రధాన పాత్ర కోసం నిర్మాతలు కొత్త ముఖాన్ని వెతుకుతున్న సమయంలో, ఒక పత్రికలో ప్రచురితమైన బిస్కెట్ ప్రకటనలో రమ్యకృష్ణ ఫొటో కనిపించిందట. ఆమె రూపం నచ్చడంతో వివరాలు సేకరించగా, ప్రముఖ పాత్రికేయుడు, విమర్శకుడు చో రామస్వామికి మేనకోడలు అని తెలిసినట్లు సమాచారం. దీంతో చిత్రబృందం చో రామస్వామిని సంప్రదించి రమ్యకృష్ణను సినిమాలో నటింపజేయాలని కోరిందట. అనంతరం దర్శకుడు స్వయంగా వెళ్లి ఆమెను కలవడంతో 'వెళ్లై మనసు' చిత్రంలో కథానాయికగా అవకాశం లభించింది. ఆ సమయంలో రమ్యకృష్ణ ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని కావడం విశేషం. తమిళంలో తొలి చిత్రం చేసిన తర్వాత 'బాల్యమిత్రులు' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. అనంతరం వరుస విజయాలతో అగ్ర కథానాయికగా ఎదిగి, దక్షిణ భారత సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేశారు. అందం, అభినయం, వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించిన రమ్యకృష్ణ అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించారు. ఒక చిన్న ప్రకటనతో ప్రారంభమైన ప్రయాణం, నేడు భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత గౌరవనీయ నటీమణుల్లో ఒకరిగా రమ్యకృష్ణను నిలబెట్టిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

# 'పెద్ది' సంబరాల్లో ఉపాసన సందడి

థియేటర్‌లో కేరింతలు



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సాన తెరకెక్కించిన భారీ స్పోర్ట్స్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'పెద్ది' విడుదలతో తెలుగు రాష్ట్రాల్లో పండుగ వాతావరణం నెలకొంది. సినిమా విడుదల సందర్భంగా హైదరాబాద్‌తో పాటు పలు నగరాల్లోని థియేటర్ల వద్ద అభిమానులు భారీ ఎత్తున చేరుకుని సంబరాలు జరుపుకుంటున్నారు. భారీ కటౌట్లు, బ్యానర్లు, డప్పుల మోతలు, బాణాసంచా కాల్పులతో మెగా అభిమానులు థియేటర్ల పరిసరాలను ఉత్సవ వాతావరణంగా మార్చేశారు. సినిమాపై నెలకొన్న భారీ అంచనాల నడుమ హైదరాబాద్‌లోని విమల్ 700 ఎంఎం థియేటర్‌లో ప్రత్యేక ప్రీమియర్ షోను నిర్వహించారు. ఈ ప్రీమియర్ షోకు రామ్ చరణ్ సతీమణి ఉపాసన కొణిదెల హాజరై అభిమానులతో కలిసి సినిమా వీక్షించారు. ముఖ్యంగా రామ్ చరణ్ మాస్ ఎంట్రీ సన్నివేశాలు, యాక్షన్ ఘట్టాలు తెరపై కనిపించిన సమయంలో ఉపాసన ఎంతో ఉత్సాహంగా స్పందించారు. కేకలు వేస్తూ, విజిల్స్ వేస్తూ, పేపర్లు విసురుతూ అభిమానులతో కలిసి ఆమె చేసిన సందడి ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. థియేటర్‌లో సాధారణ ప్రేక్షకురాలిలా సినిమా ఆస్వాదించిన ఆమె వీడియోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. సినిమా విడుదల సందర్భంగా సినీ ప్రముఖులు కూడా చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. హీరో వరుణ్ తేజ్ సామాజిక మాధ్యమాల ద్వారా స్పందిస్తూ, రామ్ చరణ్ ఈ చిత్రం కోసం ఎంత కష్టపడ్డారో తనకు తెలుసని పేర్కొన్నారు. ఆయన అంకితభావం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. అలాగే దర్శకుడు బుచ్చిబాబు, సంగీత దర్శకుడు ఏ ఆర్ రెహమాన్ సహా మొత్తం చిత్రబృందానికి అభినందనలు తెలుపుతూ సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. అదే విధంగా నటి సమంత రూత్ ప్రభు కూడా 'పెద్ది'పై ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా కోసం తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని, రామ్ చరణ్ ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని ఆమె పేర్కొన్నారు. చరణ్ ఈ పాత్ర కోసం ఎంతో శ్రమించారని, మొత్తం చిత్రబృందానికి తన శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని చెప్పారు. సినిమా విజయం సాధించే అన్ని లక్షణాలు కనిపిస్తున్నాయని ఆమె అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా, ప్రస్తుతం పొల్లాచిలో చిత్రీకరణ జరుపుకుంటున్న 'మెగా 158' చిత్రబృందం కూడా సెట్స్ నుంచే 'పెద్ది' టీంకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేసింది. రామ్ చరణ్, బుచ్చిబాబు, నిర్మాణ సంస్థకు విజయాభినందనలు తెలుపుతూ ఒక ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. ఈ వీడియో కూడా అభిమానుల మధ్య మంచి ఆదరణ పొందుతోంది. దర్శకుడు అనిల్ రావిపూడి సైతం 'పెద్ది' చిత్రంపై ప్రశంసలు కురిపించారు. ప్రారంభం నుంచే ఈ సినిమా ప్రయాణం ఆసక్తిని కలిగించిందని పేర్కొన్న ఆయన, రామ్ చరణ్ చేసిన శారీరక మార్పులు, పాత్ర కోసం చూపిన నిబద్ధత అసాధారణమని కొనియాడారు. 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించి, చాలా కాలం గుర్తుండిపోయే చిత్రంగా నిలవాలని ఆకాంక్షించారు. ఇప్పటికే ప్రీమియర్ షోల నుంచి వస్తున్న స్పందనతో అభిమానుల్లో మరింత ఉత్సాహం పెరిగింది. గ్రామీణ క్రీడల నేపథ్యంతో రూపొందిన ఈ చిత్రంలో రామ్ చరణ్ కొత్త అవతారంలో కనిపించడంతో ప్రేక్షకులు భారీగా ఆకర్షితులవుతున్నారు. విడుదల రోజునే థియేటర్ల వద్ద కనిపిస్తున్న హడావుడి చూస్తుంటే, 'పెద్ది' మెగా అభిమానులకు ఒక భారీ వేడుకగా మారిందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# అర్జున్ ఇంట పెళ్లి సందడి?



దక్షిణ భారత సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా కుటుంబంలో త్వరలో పెళ్లి బాజాలు మోగనున్నాయనే వార్తలు సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆయన చిన్న కుమార్తె అంజనా సర్జా ఈ ఏడాది అక్టోబర్ నెలలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై కుటుంబ సభ్యుల నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. కన్నడ చిత్రసీమలో కథానాయకుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన అర్జున్ సర్జా, తెలుగు, తమిళ భాషల్లోనూ అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించి ప్రేక్షకుల అభిమానాన్ని సంపాదించారు. ప్రస్తుతం నటుడిగా, నిర్మాతగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్న ఆయన కుటుంబ పరంగా కూడా ఆదర్శ తండ్రిగా ప్రశంసలు అందుకుంటున్నారు. అర్జున్ పెద్ద కుమార్తె ఐశ్వర్య సర్జా సినీ రంగంలో నటిగా కొనసాగుతుండగా, చిన్న కుమార్తె అంజనా సర్జా మాత్రం వ్యాపార రంగాన్ని ఎంచుకున్నారు. అమెరికాలోని ప్రముఖ విద్యాసంస్థలో ఫ్యాషన్ డిజైన్ విద్యను అభ్యసించిన అంజనా, ప్రస్తుతం ఫ్యాషన్ డిజైనర్‌గా, వ్యాపారవేత్తగా మంచి గుర్తింపు పొందారు. ఆమె స్థాపించిన 'సర్జా' సంస్థ పర్యావరణహిత విలాసవంతమైన చేతి సంచుల తయారీలో ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. పండ్ల వ్యర్థాలు, యాపిల్, పైనాపిల్, కాక్టస్ వంటి సహజ పదార్థాలతో రూపొందించే ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో ఆదరణ లభిస్తోంది. వ్యక్తిగత జీవితానికి వస్తే, అంజనా గత పదమూడు సంవత్సరాలుగా అమెరికాకు చెందిన ఓ యువకుడితో ప్రేమలో ఉన్నట్లు సమాచారం. విదేశాల్లో చదువుకునే సమయంలో ప్రారంభమైన పరిచయం కాలక్రమేణా ప్రేమగా మారిందని తెలుస్తోంది. గత ఏడాది ఇటలీలోని ప్రముఖ పర్యాటక ప్రాంతంలో కుటుంబ సభ్యుల సమక్షంలో వీరి నిశ్చితార్థం జరిగినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఈ వేడుకను అత్యంత గోప్యంగా నిర్వహించినట్లు కూడా ప్రచారం జరిగింది. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వినిపిస్తున్న కథనాల ప్రకారం, అంజనా మరియు ఆమె కాబోయే జీవిత భాగస్వామి అక్టోబర్ నెలలో వివాహం చేసుకోనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇప్పటికే పెళ్లి ఏర్పాట్లు కూడా ప్రారంభమైనట్లు కొన్ని కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ వార్తలపై అర్జున్ సర్జా కుటుంబం నుంచి ఎలాంటి అధికారిక స్పష్టత రాకపోవడంతో, అభిమానులు అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PUTTI MURALI, PRINTED AT INDUR OFFSET PRINTERS, OPP : CHEER HANUMAN TEMPLE, WEEKLY BAZAR,NIZAMABAD- 503001, NIZAMABAD DISTRICT, TELANGANA STATE, PUBLISHED AT HNO.1-86/10/05, KOTARMOOR(PERKIT), ARMOOR-503224, NIZAMABAD DISTRICT, TELANGANA STATE. EDITOR : PUTTI MURALI, TELTEL/2022/85170, EMAIL :prajashankaravam@gmail.com